
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 7 సెప్టెంబరు 2025



'సోమశిల'కు 25,822 క్యూసెక్కుల వరద

అనంతసాగరం సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం 25,822 క్యూసెక్కుల వరద కొనసాగింది. డ్యాంలో 67.380 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,300, డెల్టాకు 1,850 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

పరిశ్రమలకు శుద్ధిజలం

జిల్లాలోని కృష్ణపట్నం వద్దనున్న పరిశ్రమలకు నెల్లూరు నుంచి శుద్ధి చేసిన (ఎస్టీపీ) నీటిని సరఫరా చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేస్తున్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ వైవో నందన్ తెలిపారు. అలాగే మురికివాడల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టబోయే పలు అభివృద్ధి అంశాలను కమిషనర్ తన కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- ఇందుకు అవసరమైన డీపీఆర్‌ను రూపొందిస్తున్నాం
- పారిశుధ్య నిర్వహణపై పొరుగు రాష్ట్రాల్లో అధ్యయనం
- వంద అక్రమ భవనాలపై చార్జిషీట్
- లోక్ అదాలత్‌లో సెటిల్‌మెంట్ చేసుకోవాలి
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా 200 ఆటోలు తెప్పిస్తున్నాం
- 'ఆంధ్రజ్యోతి'తో కార్పొరేషన్ కమిషనర్ నందన్

'అల్లీపురం, అక్కచెరువుపాడు, వెంకటేశ్వరపురం ప్రాంతాలలోని ఎస్టీపీల ద్వారా 40 ఎంల్డీ నీళ్ల శుద్ధి చేస్తున్నాము. వాటిని కృష్ణపట్నం వద్దనున్న పరిశ్రమలను సరఫరా చేసేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నాం. దీని ద్వారా ఎన్ఎంసీ ఖజానాకు ఆర్థిక లబ్ధి చేకూరుతుంది. అలాగే నగరంలోని మురికివాడల్లో పారిశుధ్యం మెరుగు కోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నాము. ఇందులో భాగంగా తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో అమలవుతున్న పారిశుధ్య నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం నన్ను అధ్యయనానికి పంపింది. వాటిల్లో ఫలితాలిచ్చే అంశాలను నెల్లూరులో అమలు చేసేందుకు పరిశీలిస్తున్నాము. గండిపేటలో మురుగునీటిలోని వ్యర్థాల మేనేజ్‌మెంట్ ప్లాంటు ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయి. తెలంగాణలోని జవహర్‌నగర్‌లో చెత్తనుంచి కరెంట్ తయారీతో రోజుకు 5 లక్షల యూనిట్ల ఉత్పత్తి జరుగుతోంది. సిద్దిపేట, సూర్యపేట ప్రాంతాలలో ప్రజల భాగస్వామ్యంతో నూరు శాతం ఇంటింటి చెత్త సేకరణ బాగుందని గుర్తించాము.

వంద అక్రమ భవనాలపై చార్జిషీట్

దేశంలో ఎక్కడ లేనంతగా భవన నిర్మాణ అనుమతులను రాష్ట్ర ప్రభుత్వం సులభతరం చేసింది. అయినా అక్రమ నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయి. నెల్లూరులో ఇలాంటి భవనాలను సచివాలయాల ద్వారా గుర్తించాము. 166 సచివాలయాల పరిధిలో 100 భవనాలను గుర్తించి వాటి యజమానులపై చార్జిషీట్ దాఖలు చేశాము. వీరంతా త్వరలో జరుగు లోక్‌అదాలత్‌లో సెటిల్‌మెంట్ చేసుకోవాలి. అనధికారికంగా వేసిన లేఅవుట్లు, అక్రమంగా నిర్మించిన భవనాలు ఎప్పటికైనా సమస్యేనన్న విషయం వాటి యజమానులు గుర్తించాలి. నెల్లూరులోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో దుకాణాలన్నీ ఆన్‌లైన్ చేస్తున్నాము. ఎవరైనా అద్దె చెల్లించకపోతే ఆ వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో తెలిసిపోతుంది. ఇప్పటి వరకు అద్దె ఎందుకు వసూలు చేయలేదో సంబంధిత అధికారులను గుర్తించి షోకాజు నోటీసులు జారీ చేస్తున్నాం.

రోజుకు 850 కి.మీ మేర రోడ్లు శుభ్రం

నెల్లూరు నగరాన్ని శుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాము. 26 యంత్రాల ద్వారా నిత్యం నగర పరిధిలో 850 కి.మీ విస్తీర్ణంలో శుభ్రం చేస్తున్నాం. గతంతో పోల్చితే ప్రస్తుతం రోడ్లు క్లీన్‌గా కనబడుతున్నాయి. నూటికి నూరు శాతం ఇళ్ల వద్దే చెత్తను సేకరించేందుకు యంత్రాలను రంగంలోకి దింపనున్నాం. ఇందులో భాగంగా 200 ఈ ఆటోలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా తెప్పిస్తున్నాము. ప్రస్తుతం ట్రాక్టర్లు ఉన్నా అవి ఇళ్ల వద్దకు వెళ్లలేక చెత్తసమీకణ సవాల్‌గా మారింది. ఆటోలు వస్తే ఆ సమస్య ఉండదు.' అని కమిషనర్ అన్నారు.

- నెల్లూరు(సిటీ, ఆంధ్రజ్యోతి)

ఎందుకంత నిర్లక్ష్యం!



ఎవరెన్ని విమర్శలు చేసినా.. అధికారులు అక్షింతలు వేస్తున్నా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మాత్రం మార్పు రావడం లేదు. యేటా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా పల్లెజనానికి మాత్రం సరియైన వైద్యం అందనంటోంది. ఇందుకు నిదర్శనం తాజాగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ విడుదల చేసిన గ్రేడ్‌ల జాబితానే. జిల్లావ్యాప్తంగా 52 పీహెచ్‌సీలు ఉండగా ఒక్క దానికి కూడా 'ఏ' గ్రేడ్ దక్కలేదు. చెప్పుకోదగ్గ స్థాయిలో బీ గ్రేడ్‌లో 8 కేంద్రాలు ఉన్నాయి. దుత్తలూరు పీహెచ్‌సీకి చివరి గ్రేడ్ దక్కింది.

- పీహెచ్‌సీల పనితీరుపై గ్రేడ్‌ల కేటాయింపు
- జిల్లాలో ఒక్క కేంద్రానికీ దక్కని ఏ గ్రేడ్
- బీ గ్రేడ్‌లో 8, సీలో 32, డీలో 11 కేంద్రాలు
- ఆఖరిస్థానం ఈ గ్రేడ్‌లో దుత్తలూరు
- రూ.కోట్లు ఖర్చు చేస్తున్నా దక్కని ఫలాలు
- సరైన వైద్యసేవలు అందక గ్రామీణుల అవస్థలు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరుపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రతినెల గ్రేడ్‌లను ప్రకటిస్తుంది. ఆయా కేంద్రాల పనితీరు ఆధారంగా ఈ గ్రేడ్‌లను కేటాయిస్తుంటారు. తాజాగా జూలై మాసానికి సంబంధించిన గ్రేడ్‌లను ప్రకటించగా, జిల్లాలోని ఏ పీహెచ్‌సీకి కూడా ఏ గ్రేడ్ దక్కలేదు. బీ, సీ, డీ, ఈ గ్రేడ్‌లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఆయా ఆసుపత్రులకు ప్రతి రోజూ ఎంతమంది అనారోగ్యంతో వస్తున్నారు. వారికి అందించే వైద్య పరీక్షలు, గర్భిణు లకు అందుతున్న సేవలు, ప్రస వాలు వంటి వాటిని పరిశీలించి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ గ్రేడ్‌లు కేటాయిస్తుంది. జిల్లావ్యాప్తంగా 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా దుత్తలూరు కేంద్రం ఈ గ్రేడ్‌లో పూర్తిగా వెనుక బడి ఉంది. ఇక్కడ ప్రజలకు వైద్య సేవలు సరిగ్గా అందటం లేదన్న విషయంపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే చిరమన, మహ్మదాపురం, వలేటివారిపాళెం, సీతారామపురం వంటి 29 కేంద్రాలలో అసలు ప్రసవాలే జరగలేదని ఆరోగ్య శాఖ తాజా బులెటిన్ వెల్లడిస్తోంది. కేంద్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో ప్రజలకు మెరుగైన చికిత్సలు అందించాలన్న ఉద్దేశంతో ప్రతి ఏడాది నేషనల్ రూరల్ హెల్త్ కింద జిల్లాకు రూ.30 కోట్లకుపైగా విడుదల చేస్తుంది. ఒక్కో పీహెచ్‌సీకి ఆసుపత్రుల నిర్వహణ అత్యవసర మందుల కోసం రూ.1.75 లక్షలు వంతున కేటాయిస్తారు.

ఏ గ్రేడ్ పీహెచ్‌సీలు ఏవి..?

తాజా బులిటెన్‌లో జిల్లాలోని ఏ పీహెచ్‌సీకి కూడా ఏ గ్రేడ్ రాలేదు. దీన్నిబట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు ఎలా ఉందో తెలుస్తోంది. రాష్ట్రంలోని 1,145 పీహెచ్‌సీలలో 163 వ స్థానంలో రామతీర్థం, 204వ స్థానంలో విడవలూరు (జిల్లాలో 1, 2 స్థానాలు) వైద్యసేవల్లో మెరుగ్గా నిలిచాయి. చిరమన, మహ్మదాపురం, మాచవరం, జగదేవిపేట, వలేటివారి పాళెం, సీతారామపురం, లింగసముద్రం పీహెచ్‌సీలు తరువాత స్థానాలలో నిలిచాయి. ఇక బీ గ్రేడ్‌లో 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సీ గ్రేడ్‌లో 32, డీ గ్రేడ్‌లో 11 పీహెచ్‌సీలు నిలిచాయి. ఈ గ్రేడ్‌లో 1 దుత్తలూరు పీహెచ్‌సీ మాత్రమే ఉంది. మొత్తం మీద జిల్లాలోని పీహెచ్‌సీలు 55 శాతం ప్రజలకు వైద్య సేవలు అందించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఓపీ వైద్యసేవలలోపాటు 1 ప్రసవం, 5.17 రకాల పరీక్షలు నిర్వహించినందుకు రామతీర్థం అగ్రస్థానంలో నిలిచింది.



దుత్తలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ప్రత్యేక దృష్టి పెడుతున్నాం

పీహెచ్‌సీలను ఏ గ్రేడ్‌లో నిలిపేందుకు కృషి చేస్తున్నాము. ప్రతిరోజూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును పరిశీలిస్తూ ఎక్కడ లోపాలు ఉన్నాయో తెలుసుకుని వాటిని సరిదిద్దుతున్నాము. గర్భవతులకు అందించే వైద్యసేవలపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ప్రతి పీహెచ్‌సీలలో ప్రసవాలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. అలాగే సాధారణ వైద్య చికిత్సలకు ప్రాధాన్యత ఇవ్వాలని కూడా సూచిస్తున్నాము.

- డాక్టర్ సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

యూరియా కొరత లేదు!

2,471 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయ్!

కలెక్టర్ ఆనంద్ వెల్లడి

నెల్లూరు (వ్యవసాయం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దాదాపుగా 2,471 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని కలెక్టర్ ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిరంతరాయంగా యూరియాను సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు తప్పనిసరిగా తమ వేలిముద్రలు నమోదు చేసి యూరియా కొనుగోలు చేయాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారుల సిఫార్సు చేసిన మోతాదు మేరకే యూరియాను వినియోగించాలని రైతులకు సూచించారు. అధికంగా ఎరువులు వాడటం వల్ల చీడపీడలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తుంటే వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని, ఏవైనా ఇబ్బందులు ఉంటే 8331057285 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

డీకేడబ్ల్యూ కళాశాలలో సర్టిఫికెట్ కోర్సు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గృహ విజ్ఞానశాస్త్ర విభాగం పర్యవేక్షణలో న్యానీ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డీ.గిరి ఒక ప్రకటనలో తెలిపారు. నేటి ఆధునిక సమాజంలో కుటుంబంలోని తల్లిదండ్రులిద్దరూ వారివారి వృత్తుల కారణంగా పిల్లల సంరక్షణకు సరైన సమయం కేటాయించలేకపోతున్న సంఘటనలు చూస్తున్నామన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఏడాది కాలం ఉండే న్యానీ సర్టిఫికెట్ కోర్సు ను ఈనెల 15 నుంచి ప్రారంభిస్తున్నామన్నారు. టెన్త్ ఉత్తీర్ణత సాధించి, 40 ఏళ్ల లోపు ఉండే మహిళలు కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

స్కూల్‌గేమ్స్ ఎంపికల షెడ్యూల్ విడుదల

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల క్రీడాసమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించే స్కూల్‌గేమ్స్ ఎంపికల షెడ్యూల్ విడుదల చేసినట్లు డీవీఈవో కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17, 19 బాలబాలికలకు ఈనెల 10న ఆర్చరీ, గట్కా, సెపక్ తక్రా ఎంపికలుంటాయన్నారు. 11న ఫెన్సింగ్, కురాష్, ఊషు, ఫుట్‌బాల్, 14న సైక్లింగ్, కరాటే, మాల్‌కంబ్, సాఫ్ట్‌బాల్, 15న జూడో, కలారియపట్టు, షూటింగ్, నెట్‌బాల్, 16న స్క్వాష్, టెన్నిస్, వెయిట్‌లిఫ్టింగ్, 17న బాక్సింగ్, మోడరన్ పెంథలాన్, టేబుల్‌టెన్నిస్, వాటర్‌పోలో, రగ్బీ, 18న జిమ్నాస్టిక్స్, తైక్వాండో, స్విమ్మింగ్, 19న మార్షల్ ఆర్ట్స్, స్కేటింగ్, రెజ్లింగ్ ఎంపికలు చేపడతామన్నారు. ఎంపికలు పూర్తయిన తరువాత ఈనెల 23 నుంచి 26 వరకు అంతర్‌జిల్లాల పోటీలుంటాయని తెలిపారు.

నేడు రాహుగ్రస్త చంద్ర గ్రహణం

- రాత్రి 9.57 గంటలకు ప్రారంభం.. తెల్లవారుజాము 1.26 గంటలకు ముగింపు
- మధ్యాహ్నం నుంచే ఆలయాల మూత

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం రాహుగ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం సంభవిస్తోంది. ఈసారి గ్రహణం ప్రజలందరికీ స్పష్టంగా కనిపించనుంది. రాత్రి 9.57 గంటలకు చంద్రగ్రహణం ప్రారంభం కానుండగా, తెల్లవారుజాము 1.26 ముగుస్తుంది. గ్రహణ కాలంలో ఉపవాసం, మంత్రజపం, దానధర్మాలు చేయాలని పండితులు చెబుతున్నారు. తద్దినాలు పెట్టుకునే వారు ఆదివారం మధ్యాహ్నం 1.20 గంటలలోపు జరుపుకోవాలి. గర్భిణులు, పిల్లలు జాగ్రత్తలు పాటించాలి. కత్తెర, సూది పనులు చేయరాదు. ఈ గ్రహణం కొందరికి ఆధ్యాత్మిక పరంగా శ్రేయస్కరమైతే, మరికొందరికి శాంతి జపాలు అవసరం. చంద్రగ్రహణం సందర్భంగా జిల్లాలోని అన్ని ఆలయాలను ఆగమాలను బట్టి మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 8.30 గంటలలోపు మూసివేయనున్నారు. సంప్రోక్షణలు అనంతరం సోమవారం ఉదయం భక్తులకు దర్శనఅవకాశాలు కల్పిస్తారు.

రోడ్డు మార్గాన కాదు.. రైళ్లలోనే!

- ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి రవాణా
- ఏడు నెలల వ్యవధిలో 11 కేసులు
- 103 కేజీల గంజాయి స్వాధీనం, 12 మంది అరెస్ట్
- వైసీపీ హయాంలో గాలికి వదిలేసిన వైనం
- ఐదేళ్లలో కేవలం ఆరు కేసులే నమోదు

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గంజాయి అక్రమ రవాణాను కూకటి వేళ్లతో సహా పెకలించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నా సాధ్యం కావడం లేదు. మొన్నటిదాకా రోడ్డు మార్గాన రవాణా చేస్తున్న అక్రమార్కులు ఆ వైపు పోలీస్ తనిఖీలు ఎక్కువవడంతో రైళ్లను ఎంచుకున్నారు. ఇక్కడ పెద్దగా తనిఖీలు ఉండవన్న భావనతో ఏజెన్సీ ప్రాంతాల నుంచి గుట్టు చప్పుడు కాకుండా జిల్లాకు దిగుమతి చేస్తున్నారు. గత వైసీపీ హయాంలో నెల్లూరు, గూడూరు రైల్వేస్టేషన్లు అడ్డాగా మారి గంజాయి అక్రమ రవాణా జోరుగా సాగింది. ఇక్కడ దిగుమతి చేసుకున్న స్మగ్లర్లు జిల్లా వ్యాప్తంగా చిన్న చిన్న ప్యాకెట్లు చేసి అమ్మకాలు సాగించారు. ఆ ఐదేళ్లలో కేవలం ఆరు కేసులు మాత్రమే నమోయ్యాయి. 2022లో ఒకటి, 2023లో 4, 2024 ఒక కేసు మాత్రమే నమోదవడం చూస్తుంటే అప్పట్లో గంజాయి రవాణా నిరోధంలో ఏమటుకు గాలికి వదిలేశారో అర్థమవుతోంది. అయితే, ప్రస్తుత ప్రభుత్వం గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈగల్ టీమ్‌తోపాటు జీఆర్పీఎస్ పోలీసులు, రైల్వే, స్థానిక పోలీసులు నాలుగు విభాగాలు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గంజాయి రవాణాపై వరుసగా దాడులు చేస్తున్నారు.

రైల్వేస్టేషన్లలో నిఘా

ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్లలో పోలీసులు గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేక బృందాలు వరుస దాడులు నిర్వహిస్తూ గంజాయిని తరలిస్తున్న వారిని అరెస్ట్ చేస్తున్నారు. ఒడిశా, విశాఖ ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లపైనే ప్రత్యేక రైల్వే పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకు 11 కేసుల్లో 103 కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని, 12 మందిని అరెస్ట్ చేశారు.

నిరంతర తనిఖీలు

ఈగల్, జీఆర్పీ, ఆర్పీఎఫ్, స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో నిరంతరం దాడులు చేస్తున్నాము. ఒడిశా, రాయగడ్, విశాఖపట్నం ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాము. గంజాయి విక్రయాలపై సమాచారం ఉంటే రైల్వే పోలీసులకు అందించాలని ప్రజలను కూడా కోరుతున్నాము.

- జీ మురళీధర్, రైల్వే డీఎస్పీ



నిందితుల వివరాలు తెలుపుతున్న రైల్వే డీఎస్పీ మురళీధర్

నెల్లూరు, ఒంగోలు, చీరాల స్టేషన్లలో నలుగురి అరెస్ట్

- 17,600 కేజీల గంజాయి స్వాధీనం

మత్తు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి లో భాగంగా నెల్లూరు, ఒంగోలు, చీరాల రైల్వే స్టేషన్లలో పలు రైళ్లను తనిఖీ చేసి, 17.600 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే డీఎస్పీ మురళీధర్ తెలిపారు. శనివారం నెల్లూరు రైల్వేస్టేషనులోని తన కార్యాలయంలో ఆయన ఈ కేసుల పూర్వాపరాలను వెల్లడించారు. నెల్లూరు రైల్వే సీఐ సుధాకర్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రమేష్‌గౌడ్‌లు తమ సిబ్బందితో కలిసి నెల్లూరు స్టేషన్‌లో పలు రైళ్లలో తనిఖీలు చేశారు. టాటా- ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలులో అనుమానాస్పదంగా ఉన్న కర్నాటక రాష్ట్రం కోలార్ జిల్లా చిక్‌బళ్లా పూర్‌కు చెందిన కె వెంకటేష్‌ను అదుపులోకి తీసుకొన్నారు. ఆయన బ్యాగులో నుంచి 6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసినట్లు విచారణలో నిందితుడు తెలిపినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన రైల్వే ఎస్‌ఐ ఎన్ హరిచందన, ఆర్పీఎఫ్ ఎస్‌ఐ కొండయ్య, సిబ్బందిని అభినందించారు.

ఒంగోలులో పూరి-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలులో..

అనుమానాస్పదంగా ప్రయాణిస్తున్న తమిళనాడులోని శాలిగ్రామ్ జిల్లాకు చెందిన ప్రేమ్‌చంద్, కొండితోపే ప్రాంతానికి చెందిన మనీష్ దూబేలను అరెస్ట్ చేసి, 7.600 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. అలాగే, చీరాల రైల్వేస్టేషన్‌లో ధనబాద్-అల్లెప్పి ఎక్స్‌ప్రెస్‌లో కేరళలోని ఎర్నాకుళం జిల్లా కక్కనాడ్ ప్రాంతానికి చెందిన ఇబ్రహీమ్‌ను అరెస్ట్ చేసి, 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఓ ముఠా గుట్టురట్టు!

- ఆరుగురి అరెస్ట్.. 23 కిలోల గంజాయి స్వాధీనం
- సూత్రధారి జైలులో ఉన్న ఓ ఖైదీ
- విచారణలో వెల్లడించిన నిందితులు

గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఓ ముఠాను నెల్లూరులోని వేదాయపాలెం పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి నుంచి 23.470 కేజీల గంజాయి, ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరానికి చెందిన కొందరు గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారని వేదాయపాలెం సీఐ శ్రీనివాసరావుకు శుక్రవారం రాత్రి పక్కా సమాచారం అందింది. దీంతో ఆయన నెల్లూరు రూరల్ మండలం దొంతాలి అడ్డరోడ్డు సమీపంలో తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా వెళుతున్న ఓ కారును పరిశీలించగా, రూ.2.50 లక్షల విలువ చేసే 23.470 కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారులో ఉన్న నెల్లూరు ముత్యాలపాలెంకు చెందిన పి మహేష్, డి వినీత్, హరనాథపురానికి చెందిన బి సూర్యసాయి, మాగుంటలేఅవుట్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డి, గాంధీనగర్‌కు చెందిన షేక్ ఫిరోజ్, సోమశేఖరపురానికి చెందిన టి మల్లికార్జునలను అదుపులోకి తీసుకున్నారు. కారు ముందు బైక్‌పై పైలెట్‌గా వెళుతున్న జాకీర్ మాత్రం పరారయ్యాడు. నిందితలను పోలీస్ స్టేషన్‌కు తరలించి, తమదైన శైలిలో పోలీసులు విచారించగా ఇప్పటికే మరో కేసులో జైలులో ఉన్న జగదీష్ గంజాయిని దిగుమతి చేసుకుని తమద్వారా విక్రయిస్తున్నట్లు నిందితులు వెల్లడించారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. పరారీలో ఉన్న జాకీర్ కోసం గాలిస్తున్నారు.

నేడు చంద్ర గ్రహణం.. ఆలయాల మూసివేత

బుచ్చిరెడ్డిపాళెం,సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం నేపథ్యంలో జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో ఉదయం నివేదనల అనంతరం మధ్యాహ్నం 1 గంటకు ఆలయం మూసి వేస్తామని ఆలయ ఈఓ ఏవీ శ్రీనివాసులు రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలి పారు. బుచ్చి పెద్దూరులోని శ్రీకోదండరామస్వామి ఆలయాన్ని శనివారం ఉద యం నివేదన అనంతరం మూసివేసి, సోమవారం ఉదయం తెరుస్తామని ఆల య వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 101243
వెండి కిలో ధర	రూ. 127700
వెండి ఒక గ్రాము	రూ. 130.70



ఇంటింటికీ తాగునీరందిస్తాం!

జగదీశ్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, విడవలూరు

విడవలూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటి కీ తాగునీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీశ్ తెలిపారు.

?. 'జలజీవన్ మిషన్' కింద ఎన్ని నిధులు మంజూరయ్యాయి

!. మండలంలో మొదటి విడత రూ.60 లక్షలు మంజూరయ్యాయి. పార్లపల్లి, పంచా యతీలో పనులు పూర్తయ్యాయి. మిగిలిన 11 పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయి.

?. మురుగు కాలువల నిర్మాణానికి ఏ మేరకు నిధులు మంజూరయ్యాయి

!. మురుగు కాలువల నిర్మాణానికి జడ్పీ నిధులు రూ.12 లక్షలు, పీఎంఏజేవై కింద రూ.15లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది.

?. కాలువల నిర్మాణంలో అవకతవకలు అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు

!.మురుగు కాలువల నిర్మాణంలో ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణా లను పాటిస్తున్నాం. ఎప్పటికప్పుడు ఉన్నతా దికారులు పర్యవేక్షిస్తున్నారు.

'నిఘా' నేత్రాలున్నాయ్.. తస్మాత్ జాగ్రత్త!

పొదలకూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పది మంది పోలీసులు చేయలేని పనిని ఒక్క సీసీ కెమెరా చేస్తోందని పోలీసు అధికారులు చెబుతున్నారు. సీసీ కెమెరాలు వచ్చాక పోలీసులకు కేసులను ఛేదించడం చాలా సులభతరమైనందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. కేసుల దర్యాప్తులో ఇవి కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఎక్కడ ఏ చిన్న నేరం జరిగినా ముందుగా పోలీసులు సీసీ కెమెరాలున్నాయా అని అడుగుతున్నారంటే వాటి ప్రాధాన్యత ఏ స్థాయిలో ఉందో తెలుస్తోంది. పట్టణంలో పలు రోడ్ల కూడళ్లలో గేట్ సెంటర్, సంగంరోడ్డు, పంచాయతీ బస్టాండ్‌లో అలాగే మండలంలోని 30 పంచాయతీలో ఉండే 56 గ్రామాల్లోగాను ప్రవేశ ముఖద్వారాల వద్ద, ప్రధాన ఆలయాల వద్ద, గ్రామాల ఎగ్జిట్ వద్ద, పొదలకూరు మండలంలో 128 సీసీ కెమెరాలు, సర్కిల్ పరిధిలోని మనుబోలులో 76 సీసీ కెమెరాలు పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్‌ఐ హనీఫ్ తమ సిబ్బందితో కలిసి ఏర్పాట్లు చేయించారు. వంద మంది ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరా ఉండాలన్నదే ఏపీ ప్రజా భద్రతా చట్టంలోని సారాంశం. ఎక్కువగా చోరీ కేసుల్లో దొంగలు సీసీ కెమెరాలకు అడ్డంగా దొరికిపోతున్నారు. పొదలకూరు సర్కిల్ పరిధిలో 204 సీసీ కెమెరాలున్నాయి. వీటితోపాటు ప్రతి కూడలిలో 360 డిగ్రీల కెమెరాలున్నాయి. ఇవీ కాకుం డా పట్టణ వాసులు, కాలేజీ, స్కూల్స్ యాజ మాన్యాలు, వ్యాపారస్తులు వ్యక్తిగతంగా ఏర్పాటు చేసుకు న్నవి. సుమా రు 300 వరకు ఉన్నాయి. సీసీ కెమెరాలతో నేరస్తులను సులభంగా పట్టుకోవచ్చుననే ఉద్దేశ్యంతో దుకాణాలు, అపార్ట్‌మెంట్, వాణిజ్య కేంద్రాలు, నివాసాల్లో సైతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం విశేషం.



పట్టణంలోని పంచాయతీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

సీసీ కెమెరాలపై అవగాహన కలిగి ఉండాలి



పొదలకూరు సర్కిల్ పరిధిలోని పొదలకూరు, మను బోలు పరిధిలో ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాల ఏర్పా టుపై అవగాహన కలిగి ఉండాలి. సీసీ కెమెరాలతో నేరాలను కట్టడి చేయడం చాలా సులభం. నేరాలు జరిగినప్పుడు ప్రధాన ఆధారాలుగా సీసీ కెమెరాల ఫుటేజ్ ఉపయోగపడుతుంది. సీసీ కెమెరాల సాయంతో అనేక కీలక కేసులు ఛేదించిన సంద ర్భాలు చాలా ఉన్నాయి. అందుకే ప్రజలు సీసీ కెమెరాల ఏర్పాటుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

- శివరామకృష్ణారెడ్డి, సీఐ, పొదలకూరు

రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

● టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వాగ్వివాదం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ చంద్రశేఖర్‌రెడ్డి

పొదలకూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరులో శనివారం జరిగిన మండల పరి షత్ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. అధికారుల పట్ల అమర్యాదగా, దురుసుగా ప్ర వర్తించారంటూ టీడీపీ, వైసీపీ నాయకులు పరస్పరం వాగ్వా దానికి దిగారు. ఇప్పటివరకు వైసీ పీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని కైన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యు ల నేతృత్వంలోనే సభ కొనసాగేది. నూతనంగా టీడీపీకి చెందిన తలచీరు మస్తాన్‌బాబు సొసైటీ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఆయన సర్వసభ్య సమావేశానికి తొలిసారి హాజరయ్యారు. ఆయనతోపాటు మరికొందరు టీడీపీ నాయకులు సమావేశ మందిరంలోకి వస్తారేమోనని ముందుగానే ఇన్‌చార్జ్ ఎంపీడీవో విజశ్రీకి వైసీపీ ఎంపీటీసీ సభ్యులు చెప్పి నిలుపుదల చేయించారు. దీంతో ఇప్పటివరకు ప్రతిపక్షం లేకుండా జరిగిన సమావేశంలో ప్రశ్నించేవారు లేరు. పొదలకూరు నాలుగో ఎంపీటీసీ సభ్యుడు అధికారులను దురుసుగా మాట్లాడుతుండడంతో మస్తాన్‌బాబు అధికారులను గౌరవంగా మాట్లాడాలని చెప్పడంతో వైసీపీ నాయకులు అడ్డు తగిలారు. దీంతో ఇరుపార్టీల మధ్య వాగ్వాదం చోటుచేసుంది. ఒక దశలో టీడీపీకి చెందిన కొందరు నాయకులు సమావేశ మందిరంలోకి దూసుకొచ్చారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎస్‌ఐ హనీఫ్ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఇరుపక్షాలకు నచ్చజెప్పారు. సమావేశం పూర్తయ్యే వరకు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుబ్బరాయుడు, వైఎస్ ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు మస్తాన్‌బాబు, సర్పంచులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

వెంకటాచలం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష పథకం ప్రాజెక్ట్ అదనపు సమన్వయకర్త డి వెంకటసుబ్బయ్య సూచించారు. వెంకటాచలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం విభిన్న ప్రతిభావంతులకు ఉచిత వైద్య శిబిరాన్ని, ఉపకరణాలను అందజేశారు. ముఖ్యఅతిథిగా ఆయన విచ్చేసి మాట్లాడారు. సమగ్ర శిక్ష పథకం కింద అందజేసే ప్రతి పథకాన్ని అర్హతగల ప్రతి విద్యార్థికి అందేలా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం 6 నుంచి 18 ఏళ్ల విద్యార్థులకు చెవి, కంటి, శారీరక, మానసిక విభాగములలో అలింకో నిపుణులైన వైద్యులచే పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉపకరణాలను సిఫార్సు చేశారు. కార్యక్రమంలో సీఎంఓ పెంచలయ్య, ఐఈ సమన్వయకర్త ప్రసాద్‌రావు, ఎంఈఓలు సుధీర్ ప్రేమ్‌కుమార్, శ్రీనివాసులురెడ్డి, శోభనాద్రీశ్వర రావు, వెంకటాచలం హైస్కూల్ హెచ్‌ఎం లత, టీడీపీ మండలాధ్యక్షుడు కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెజవాడకి కోవూరు ఏఎంసీ రాకపై హర్షం

విడవలూరు,(కొడవలూరు) సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విడవలూరు మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డికి కోవూరు వ్యవసాయమార్కెటింగ్ చైర్మన్ పదవిరావటం పట్ల కొడవలూరు మండల మాజీ మహిళాధ్యక్షురాలు కామాక్షియాదవ్ హర్షం వ్యక్తం చేశారు. కొడవలూరులో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతుబాంధవుడైన బెజవాడ వంశీకృష్ణారెడ్డి పదవి దగ్గటంతో రైతుల్లో ఆనందాలు వెల్లువీరుస్తున్నాయని తెలిపారు. ఇందుకు కృషి చేసిన నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

పేదల సాగుభూములకు పట్టాలివ్వాలి

● వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్

మనుబోలు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పేదలు సాగుచేసుకునే భూములకు పట్టాలివ్వాలని జిల్లా వ్యవసాయకార్మికసంఘం కార్యదర్శి మంగళ పుల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయకార్మికసంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాగితాలపూరు గ్రామంలో పేదలకు ప్రభుత్వం 22ఏళ్ల క్రితం పట్టాలు ఇచ్చిందన్నారు. అయితే నేటికి ఆ భూములకు పట్టాలివ్వలేదన్నారు. వచ్చిన అధికారులు, మారుతున్న పాలకులు చెపుతున్నారే తప్ప పేదలను పట్టించుకోలేదన్నారు. దీనికి తోడు పేదల భూములను కబ్జారాయుళ్ళు ఆక్రమించేస్తున్నారన్నారు. వారికి అధికారులు సహకరిస్తున్నారన్నారు. దీనిపై రీసర్వే చేసి ఎవరైతే సాగుచేసుకుంటున్న పేదలున్నారే వారికి మాత్రమే పట్టాలివ్వాలని కోరుతున్నామన్నారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఎం కార్యదర్శి తలారి దేవదానం, సీఐటియు కార్యదర్శి ఆదిశేషయ్య, కాగితాలపూరు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం




మనుబోలు : ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

మనుబోలు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న 15 మంది ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులను మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంఈవోలు ఓబులు, రమేష్ కుమార్‌లు ఎంపిక చేశారు. శుక్రవారం పాఠశాలలు సెలవు కావడంతో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ శనివారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో నిర్వహించింది. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎస్‌కే అబ్దుల్ సత్తార్(కాగితాలపూరు), ఎస్. మధుసూదన్‌రావు (చెర్లోపల్లి), సిహెచ్. కరుణాకర్ (వీరంపల్లి),జి. శోభన్‌కుమార్ (వెంకన్నపాళెం), ఎస్‌వి.రంగారావు (గురివిందపూడి),ఎస్. జ్యోతి(కొలనుకుదురు), పి. శ్రీనువాసులు (కొమ్మలపూడి), యు. బాలకృష్ణ (వీరంపల్లి), ఓ.అనిత్‌కుమార్, ఎంరమాదేవి, ఎం.అపర్ణలత, ఎస్. అనంతయ్య (మనుబోలు),జి. శ్యామల (పిడూరు), ఏ. ఇందిరమ్మ (చెరుకుమూడి), పి. భాస్కర్‌రాజు (లింగారెడ్డి పల్లి)లతో పాటు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎంపికైన గురివిందపూడి హెచ్‌ఎం. బి. రామ్మోహన్‌రావును ఎంఈవోలతో పాటు, యూటిఎఫ్, బిటిఏ, ఎస్‌టిఏ, పీఆర్‌టియు సంఘాల నాయకులు శాలువాలుకప్పి, పూలమాలలు, బొకేలు, జ్ఞాపికలు అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం ఇద్దరు ఎంఈవోలను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

● విడవలూరులో...

విడవలూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోదని అలగానిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం పొందిన దంపూరు శ్రీనివాసులు, మండలస్థాయి అవార్డు అందుకున్న ఉప్పలపాటి ప్రసాదరాజులను స్థానిక సర్పంచు శీలు శేషయ్య, టీడీపీ నాయకుడు కొప్పర్తి హరనాథ్, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ సుప్రజ, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల శ్రీనివాసులు, ప్రసాదరాజులు ఎంతో శ్రద్ధతో బోధిస్తున్నారన్నారు. వారి సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రదానం చేయడం హర్షణీయమన్నారు.



విడవలూరులో సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

సమాజ మార్గదర్శకులు.. ఉపాధ్యాయులు

డిప్యూటీ డీఈవో ఎస్‌వీ నాయక్



సత్కారం అందుకున్న ఉపాధ్యాయులు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సమాజానికి మార్గదర్శకులు ఉపాధ్యాయులని డిప్యూటీ డీఈఓ ఎస్‌వీ నాయక్ అన్నా రు. మండలంలోని కొత్తూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్‌వీ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే శక్తి కేవలం ఉపాధ్యాయులకే ఉందన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడిగా ఎందరో విద్యార్థులకు మార్గదర్శకుడిగా నిలిచాడన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ శ్రీహరి కోట జయలక్ష్మి, మండల పరిషత్ అధ్యక్షుడు జీ శంకరయ్య, ఎంఈవో సునీల్‌కుమార్, చెవుల రామ చంద్రయ్య యాదవ్, వేంకటేశ్వర్లు, టీ శారద, మంజు లమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులది కీలక పాత్ర

అల్లూరు, (ఆంధ్రజ్యోతి) : సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులు పరోక్షంగా కీలక పాత్ర పోషిస్తారని తహసీల్దారు లక్ష్మీనారాయణ అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా అల్లూరులోని జడ్పీ ఉన్నత పాఠ శాలలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానసభ ఏర్పాటు చేశారు. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.

ఏపీ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా వలిపి మునిస్వామి



వెంకటాచలం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఏపీ వడ్డెర వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సర్వేపల్లి నియోజకవరంలోని వెంకటాచలం పంచాయతీ వడ్డిపాళెం గ్రామానికి చెందిన వలిపి మునిస్వామి శనివారం నియమితులయ్యారు. ఈయన 2001 - 2006లో వెంకటాచలం పంచాయతీ సర్పంచ్‌గా పని చేశారు. ఆ తర్వాత టీడీపీ బీసీ సెల్ మండలాధ్యక్షుడిగా, టీడీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శిగా పార్టీకి తనసేవలను అందించారు. దీంతోపాటు మండల, జిల్లా స్థాయిలో అనేక పదవులను చేపట్టారు. ప్రస్తుతం ఈయన టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్య నిర్వహక కార్యదర్శిగా తన సేవలను పార్టీకి అందిస్తున్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డికి ముఖ్యఅనుచరుడిగా పేరున ఈయన గత సార్వత్రిక ఎన్నికల్లో సోమిరెడ్డికి మద్దతుగా సర్వేపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బీసీ వడ్డెర సామాజిక వర్గం ఓట్లు టీడీపీకి పడేలా ముమ్మర ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వలిపి మునిస్వామి తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి, టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు శనివారం ఏపీ వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన వలిపి మునిస్వామికి అభినందనలు తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

'నా భర్త నుంచి రక్షణ కల్పించండి'

ఐఎఫ్ఎస్ అధికారి భార్య వేడుకోలు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నా భర్త అయిన ఐఎఫ్ఎస్ అధికారి బుడిగ శ్రీనివాసులురెడ్డి నుంచి తనకు, తన పిల్లలకు రక్షణ కల్పించాలని భార్య రేణుక శనివారం మహిళా పోలీసులను కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐఎఫ్ఎస్ అధికారి బుడిగి శ్రీనివాసులరెడ్డితో 2013లో తనకు వివాహమైందన్నారు. అప్పటికే ఆయనకు రెండు పెళ్లిళ్ల అయ్యాయని, వాటిని దాచిపెట్టి మూడో వివాహం చేసుకున్నడన్న విషయం ఆలస్యంగా తెలిసిందన్నారు. తమకు ఇద్దరు పిల్లలున్నారని, అయితే తనను వదిలించుకొని మరో వివాహం చేసుకునేందుకు ఆయన కొంతకాలంగా ప్రయత్నిస్తున్నాడని ఆమె తెలిపింది. శుక్రవారం సాయంత్రం నాకుమారునికి జ్వరంగా ఉండటంతో వైద్యశాలకు తీసుకెవెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి భర్త, కుటుంబసభ్యులు ఇంటికి తాళాలు వేసి తనను ఇంటి బయట ఉంచారన్నారు. నా తల్లిదండ్రులు కడపలో ఉండటంతో రాత్రంతా పిల్లలతో కలిసి ఇంటి బయటే ఉన్నానని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వివాహం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న నా భర్తపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆమె మహిళా పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ కేసీహెచ్ రామారావుకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చొరవ తీసుకొని ఆమెను తిరిగి ఇంట్లోకి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఈ విషయంపై డీఎస్పీని వివరణ కోరగా గతంలోనే భర్తపై ఫిర్యాదు చేశారని, కోర్టులో కేసు నడుస్తోందన్నారు. ప్రస్తుత ఫిర్యాదుపై లీగల్ ఒపీనియన్ తీసుకుంటామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యాన్ని పట్టుకొన్న అధికారులు

అనంతసా గరం, సెప్టెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): మండ లంలోని మినగ ల్లు పంచాయతీ నల్లరాజుపాలెం వద్ద ఉత్తరకా లువ రహదారిపై అక్రమంగా ఆటో లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు శనివారం పట్టుకొన్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కాలువ వద్ద కాపుకాసి మినీ ఆటోలో తరలిస్తున్న 71 బస్తాలు 3.5 టన్నుల బియ్యం పట్టుకొన్నట్లు వెల్లడించారు. డ్రైవర్ పరార్ అయ్యాడు. ఈదాడిలో సాగరం డీటీ నాగలక్ష్మీ, పౌరసరఫరాల శాఖ డీటీ అజమతుల్లాఖాన్ సిబ్బంది పాల్గొన్నారు. స్వాధీనం చేసుకొన్న బియ్యాన్ని ఆత్మకూరు గొడాన్‌కు తరలించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వెంకటాచలం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనికేపల్లి సమీపంలోని ఒక ప్రైవేటు లే అవుట్ వద్ద గల పేకాట స్థావరంపై శనివారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహిం చారు. వెంకటాచలం సీఐ సుబ్బారావు, ఎస్‌ఐ ఆంజనేయులు సిబ్బంది తో కలిసి ఐదుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1240 నగదు స్వాధీనం చేసుకున్నారు.

రెండు మోటార్ బైక్‌ల ఢీ


ఇద్దరికి గాయాలు



వేణుగోపాల్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

ఉదయగిరి, సెప్టెం బరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో రెండు మోటార్‌బైక్‌లు ఢీ కొని ఇద్దరికి గాయా లైన సంఘటన శనివారం చోటు చేసు కొంది. వివరాల మేరకు.. కడప జిల్లా బద్వేల్‌కు చెం దిన వేణుగోపాల్ పని నిమిత్తం మోటార్‌బైక్‌పై ఉదయగిరికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా కళాశాల నుంచి ఇంటికెళుతున్న ఓ విద్యార్థి బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వేణుగోపాల్‌కి తీవ్ర గాయాలు కాగా, విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వేణుగోపాల్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి స్వల్ప గాయాలు



చికిత్స పొందుతున్న ఆషిక్

మనుబోలు, సెప్టెం బరు 6 (ఆంధ్రజ్యోతి): మండ ల పరి ధి లోని జాతీయ రహదారిపై వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్‌కే ఆషిక్ అనే విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. వీరంపల్లి గ్రామానికి చెందిన ఆషిక్ మనుబోలు జూనియర్ కళాశాలలో చదువుతున్నాడు. కళాశాలకు వెళుతున్న విద్యార్థిని నెల్లూరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో ఆషిక్‌కు స్వల్ప గాయాలు కాగా, మనుబోలు పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందించి, మెరుగైన వైద్యం కోసం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):గుర్తుతెలియని వ్యక్తి నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్ సమీపంలో మృతిచెందాడు.ఈ ఘటన శనివారం చోటుచేసుకుంది. మృతుడు సుమారు 50 ఏళ్ల వయసు కలిగి, బులుగురంగు టీషర్టు, బులుగురంగు షాట్ వేసుకుని ఉన్నాడు. మృతదేహాన్ని గమనించిన స్థానికులు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ కి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు చిన్నబజారు పోలీసులను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	115
స్కిన్ చికెన్	212
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 545

చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు



నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిన్నబజారు పోలీసు స్టేషన్‌ను నగర డీఎస్పీ పీ. సింధుప్రియ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను పరిశీలించి, కేసుల పెండింగ్‌కు గల కారణాలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి సలహాలు ఇచ్చారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారు ఎంతటివారైనా ఉపేక్షించవద్దని, స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, పాతనేరస్థులు, ట్రబుల్ మాంగర్స్ వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా పెంచాలని, క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు, ఎస్‌ఐ అబ్దుల్ రజాక్ పాల్గొన్నారు.

వీధికో గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రం

● నగరంలో నివాసాల మధ్య ఏర్పాటు ● పెద్ద సిలిండర్‌ల నుంచి చిన్నవాటికి... ● రీఫిల్లింగ్ చేస్తూ భారీగా అక్రమార్జన ● ప్రమాదం జరిగితే భారీగా ప్రాణనష్టం ● పట్టించుకోని అధికారులు ● మామూళ్ల వసూలు



జనార్దన్‌రెడ్డికాలనీలో బోర్డులు పెట్టి మరీ రీఫిల్లింగ్ చేస్తున్న వ్యాపారులు



నారాయణరెడ్డి పేట ప్రాంతంలో బోర్డు పెట్టి విక్రయాలు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వంట గ్యాస్ రీఫిల్లింగ్ చేయడం చట్టరీత్యా నేరం.. ఈ విషయం తెలిసినా నగరంలోని అనేక ప్రాంతాల్లో బహిరంగంగా ఈ తంతు జరుగుతుంది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం పేదలకు ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా ఇస్తున్నది. కొందరు వ్యాపారులు పెద్ద సిలిండర్లను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేసి, వాటి నుంచి గ్యాస్‌ను చిన్న సిలిండర్లకు రీఫిల్లింగ్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కేజీ గ్యాస్‌ను దాదాపు రూ.120 నంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. ఇలా గ్యాస్‌ను పెద్ద సిలిండర్ల నుంచి నాజిల్ ద్వారా చిన్న సిలిండర్లకు రీఫిల్లింగ్ చేస్తున్నారు.

● పొరపాటు జరిగితే భారీ ప్రమాదం

ఇలా రీఫిల్లింగ్ చేసే క్రమంలో ఏదైనా పొరపాటు జరిగితే అక్కడ ఉన్న సిలిండర్లు అన్నీ పేలి భారీ ప్రమాదానికి దారితీస్తాయి. నగరంలోని నారాయణరెడ్డిపేట,నరకూరు కూడలి,వెంకటేశ్వరపురం,జనార్దన్‌రెడ్డికాలనీ,కొత్తకాలువ కూడలి ఇలా అనేక ప్రాంతాల్లో విచ్చలవిడిగా వంటగ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా సివిల్ సప్లయిస్,పోలీసులు,రెవెన్యూ,తూనికలు కొలతలు,విజిలెన్స్ అధికారులు మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న వ్యాపారుల నుంచి వారికి భారీగా మామూళ్లు అందుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలి.



చిన్న సిలిండర్‌ను తూకం వేస్తున్న వైనం



పెద్ద సిలిండర్ నుంచి చిన్న సిలిండర్‌కు గ్యాస్

నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించవద్దు



ప్లానింగ్ సెక్రటరీలతో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ),సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి) : నగరంలో భవన నిర్మాణాల్లో ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని ఎన్‌ఎంసీ కమిషనర్ నందన్ ఆదేశించారు. శనివారం తన కార్యాలయంలో సిటీప్లానింగ్ సెక్రటర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనుమతులు అతిక్రమించిన వారిని గుర్తించి, చార్జిషీట్ దాఖలు చేయాలని స్పష్టం చేశారు. నిర్మాణ సమయంలో అనుమతుల ఇచ్చిన ప్లాన్ నమునాలను ప్రదర్శించేలా చూడాలన్నారు. అలా ప్రదర్శించని వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. కొన్ని డివిజన్లలో ఓసీ లేకుండానే భవనాలను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నారని, అలా వారిని కూడా గుర్తించాలన్నారు. ముందుగా పలు డివిజన్లలో పారిశుధ్య పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అనంతరం పార్కులను పరిశీలించారు.

చేనేత క్లస్టర్‌కు విరాళం



చేనేత అధికారికి చెక్కు అందిస్తున్న పెంచలయ్య తదితరులు

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాటూరు, గుమ్మలదిబ్బ చేనేత క్లస్టర్ లబ్ధిదారులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన రూ.1.26లక్షలను ఇనమడుగుకి చెందిన పద్మశాలి సంఘం గౌరవాధ్యక్షుడు చింతలపూడి పెంచలయ్య, చేనేత జౌళిశాఖ అభివృద్ధి అధికారి బాలసుబ్రహ్మణ్యంకు అందించారు. నగరంలోని చేనేత జౌళిశాఖ కార్యాలయంలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో చేనేత ఐక్యకార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షుడు బుధవరపు బాలాజీ మాట్లాడుతూ పాటూరు,గుమ్మలదిబ్బ చేనేత క్లస్టర్‌లోని 86 మంది చేనేతల అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల్లో 10శాతం నగదును తిరిగి ప్రభుత్వానికి జమ చేయాల్సి ఉందని చెప్పారు. అయితే చేనేతల కుటుంబ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆ మొత్తాన్ని పెంచలయ్య అందించి దాతృత్వాన్ని చాటుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు గుత్తికొండ వెంకయ్య, జానపద రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద నేత్రదానం





శ్రీనివాసరావు(ఫైల్), పెంచల ప్రతాప్(ఫైల్)

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చలంచర్ల శ్రీనివాసరావు(75) శనివారం మృతి చెందారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సభ్యుడు రవిప్రకాష్ సహకారంతో వాసవి వనిత లెజెండ్ అధ్యక్షుడు దుగ్గిశెట్టి హేమలత, అభయ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షురాలు శ్రీవాణి పర్యవేక్షణలో మృతుడి కుటుంబ సభ్యులు చలంచెర్ల వెంకట కళ్యాణ్ చక్రవర్తి అంగీకారంతో మృతుడి నేత్రాలను దానం చేశారు. ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ సునీల్ నేత్రాలను సేకరించారు. అలాగే నగరంలోని కుక్కలగుంటకు చెందిన వేలూరు పెంచల ప్రతాప్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యుడు వేలూరు పెంచలనరసింహులు అంగీకారంతో నేత్రాలను సేకరించారు.

నేడు దివ్యాంగ టీచర్లకు సన్మానం

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు నగరంలోని టీవీఎస్ సదన్‌లో దివ్యాంగ టీచర్లను సన్మానించనున్నట్లు దివ్యాంగుల సంక్షేమ జిల్లా కార్యదర్శి ఎస్.రంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వీఎస్‌యూ ఇంగ్లిషు విభాగం సహాయ ప్రొఫెసర్ డాక్టర్ బీవీఎస్, భగవాన్, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సేవా ప్రముఖ్ బీ.మల్లికార్జునరెడ్డి, ముఖ్యవక్తగా వీఆర్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ కే.అశోక్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. దివ్యాంగ టీచర్లంతా తరలిరావాలన్నారు.

చట్టసభల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



మాట్లాడుతున్న పద్మజా యాదవ్ తదితరులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం జాతీయ ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల పద్మజా యాదవ్ అన్నారు. శనివారం నగరంలోని బీసీ కార్యాలయంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల మహేష్‌ను బీసీ నేతలు ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పద్మజ మాట్లాడుతూ బీసీలకు రక్షణ చట్టం అమలు చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల మహేష్ మాట్లాడుతూ జిల్లాలో బీసీ సంక్షేమ సంఘాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా నాయకుడు నడవడి ముత్యంగౌడ్, సీనియర్ నేత అన్నంగి రమణయ్య, మహిళా విభాగం అధ్యక్షురాలు రజని, ఉడతా శైలజ, పల్లెపు వెంకటేశ్వర్లు, అంకయ్య, సుధాకర్, గోపి, మల్లిఖార్జున, పాలకుర్తి శ్రీనివాసులు, క్రాంతికుమార్, దేవీ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



గోపిశెట్టి సూరికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 14వ డివిజన్‌లో ఓ అపార్టుమెంట్ వాచ్‌మన్‌గా పనిచేస్తున్న గోపిశెట్టి సూరి నిరుపేద. ఆయన తన ఇద్దరు పిల్లల చదువులకు ఫీజు కట్టలేకుంటే, శనివారం బలిజ చేయూత ఫౌండేషన్ రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేసింది. ఈ మొత్తాన్ని ఫౌండేషన్ సభ్యులు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ చర్యలు

● కావలి నుంచి ఉలవపాడుకు వచ్చే మార్గం మూసివేత



నార్త్ బైపాస్‌పై మూసేసిన యూటర్న్ మార్గం

ఉలవపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణలో భాగంగా ఉలవపాడు జాతీయ రహదారిపై డేంజర్ రూట్ మార్గాలను స్థానిక ఎస్సై అంకమ్మ, హైవే అథారిటీ లోకల్ రూట్ అధికారి నర్సింగరావు, రోడ్డు సేఫ్టీ సూపర్‌వైజర్ మధుబాబులు శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా జాతీయ రహదారిపై కావలి నుంచి ఉలవపాడులోకి వాహనాలు వచ్చే ఓపెన్ డివైడర్‌ను సిమెంట్ బ్లాక్‌లతో మూసేశారు. మలుపు తిరిగి ఉలవపాడులోకి వచ్చే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నందున ఆ మార్గాన్ని మూసివేసినట్లు పోలీసులు తెలిపారు. కావలి వైపు నుంచి పట్టణంలోకి వచ్చే వాహనదారులు కొల్లురూపాడు అండర్‌పాస్ బ్రిడ్జి మార్గాన తిరిగి ఉలవపాడులోకి రావాలని, ఈ విషయాన్ని వాహన చోదకులు గమనించాలని కోరారు. ప్రమాదాల నివారణ బట్టి సౌత్ బైపాస్ మలుపు మార్గం మూసివేతపై పునరాలోచన ఉంటుందని అధికారులు తెలిపారు.

గిరిజనుల గ్రీవెన్స్‌కు అర్జీల వెల్లువ

● భూ సమస్యలకు సంబంధించి 62 వినతుల స్వీకరణ

కావలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతున్నా.. కింది స్థాయిలో చాలావరకు పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో గిరిజనుల భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా శనివారం కావలి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. కావలి డివిజన్‌లోని పలు మండలాల నుంచి గిరిజనులు అధిక సంఖ్యలో తరలివచ్చారు కనీసం కుర్చీలు, షామియానాలు కూడా ఏర్పాటు చేయకపోవటంతో బాధితులు ఇబ్బందులు పడ్డారు. ఎండలో కార్యాలయం మెట్ల మీద కూర్చుని నిరీక్షించారు. భూ సమస్యలపై 62 అర్జీలను అందజేశారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్‌లో ఆయా మండల తహసీల్దార్ కార్యాలయాలలో అర్జీలు స్వీకరిస్తున్నా.. ప్రత్యేక గ్రీవెన్స్‌కు 62 అర్జీలు వచ్చాయంటే అధికారులు సమస్యలను పరిష్కరించడం లేదన్నది స్పష్టమవుతోంది.

అవార్డు గ్రహీతకు సన్మానం

కలిగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో శనివారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పీ కరుణాకరన్ (పీజీటీ బాటనీ)ను ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

భువనేశ్వరీ ప్రసాద్‌కు అభినందనల వెల్లువ



ఉచ్చి భువనేశ్వరీ ప్రసాద్‌ను సన్మానిస్తున్న ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఏపీ రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన ఉచ్చి భువనేశ్వరీప్రసాద్‌ను శనివారం ఆయన నివాసంలో రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య సభ్యులు కలిసి సత్కరించి అభినందించారు. టీడీపీ ఆయన్ను డైరెక్టర్‌గా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్, నాయకులు వేదం హరిప్రసాద్, కారంచేటి మల్లికార్జున, కేఎల్.నారాయణ, కొత్తపల్లి విజయ్‌కుమార్, జే.నారాయణరావు, సింగరాజు నాగార్జున, సుధీర్, తదితరులు పాల్గొన్నారు. కాగా ఉచ్చి నిస్వార్థ సేవతో బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి వన్నె తేవాలని, ఆయనకు జొన్నవాడ కామాక్షితాయి ఆశీస్సులు ఉండాలని జొన్నవాడ ఆలయ అర్చకులు అభినందనలు తెలిపారు. అలాగే బ్రాహ్మణ సంఘాల నాయకులు గిరిరాజు, ప్రసాదశర్మ, రామాయణం మణిశర్మలతో టీడీపీ జిల్లా నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలియజేశారు.

మోదీ చిత్రపటానికి పాలభిషేకం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకులు, ఆహార పదార్థాలపై పన్నులను భారీగా తగ్గించి, సాధారణ ప్రజలపై ఆర్థిక భారాన్ని తగ్గించిన ప్రధాని నరేంద్రమోదీకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని బీజేపీ నాయకులు యశ్వంత్‌సింగ్ తెలిపారు. శనివారం నగరంలోని చిన్నబజారులోని బీజేపీ కార్యాలయంలో జీఎస్టీను తగ్గించిన మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు పాలభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు హేమంత్, పెంచలయ్య, బాలాజీ, సాయి, తదితరులు పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం



ఏఎంసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డిని సన్మానిస్తున్న మార్కెట్ అసోసియేషన్ నాయకులు

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ) చైర్మన్ మనుబోలు శ్రీధర్‌రెడ్డిని మార్కెట్ అసోసియేషన్ అధ్యక్షులు తాతిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. నెల్లూరు ఏఎంసీ కార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమంలో మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని అసోసియేషన్ నాయకులు, సభ్యులు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు షేక్ గయాజుద్దీన్, వెంకటేశ్వర్లు, మాలెం మధుసూదనరెడ్డి, నాగేశ్వరరావు, రాంబాబు, గణేశ్, బాలు వంశీ, రాజీవ్, పెంచలయ్య, హరికృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక పాఠశాలల్లో గురుపూజోత్సవం

నెల్లూరు(విద్య), (ఆంధ్రజ్యోతి): నగరంలోని కేఎన్‌ఆర్, వనంతోపు, భగత్‌సింగ్ కాలనీల్లోని నగరపాలక పాఠశాలల్లో శనివారం జనసేన ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర ఎంతో కీలకమైన తరుణంలో వారిని గౌరవించుకోవాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేతలు నూనె మల్లిఖార్జునా, గునుకుల కిషోర్, శ్రీరామ్, రవికుమార్, సుధామాధవ్, శ్రీపతి రాము, జమీర్, కృష్ణవేణి పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయింది

పదలవాడ వెంకమనాయుడు తండ్రి చిన్న నరసయ్య, లక్ష్మీనరసింహాపురం, గ్రామం, మనుబోలు మండలం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లాకు సంబంధించిన ముత్తుకూరు సబ్ రిజిష్టార్ ఒరిజినల్ డాక్యుమెంట్ నెం.4355/2008 లోగల సేల్ డీడ్ డాక్యుమెంటు 17-1-2008న మా ఇంటి నుండి మోటారు సైకిల్ పై మనుబోలు బస్టాండ్‌కు పోవుచుండగా మార్గమధ్యంలో పోయినది. ఎవరికైన దొరికి యెడల ఈ క్రింది ఫోన్ నెం. 80741 25248కు తెలియజేయగలరు.

మాలకొండ ఆదాయం రూ. 8,35,851

వలేటివారిపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 8,35,851 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్ల ద్వారా రూ. 6,650, కుంకుమార్చన ద్వారా రూ. 19,560, వివాహముల ద్వారా రూ. 4 వేలు, తలనీలాలు ద్వారా రూ. 47,875, వాహన పూజలు ద్వారా రూ. 3400, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 3,07800, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 450, రూముఅద్దెలు ద్వారా రూ. 31,990, కవర్లు ద్వారా రూ. 8,900, లడ్డూ ప్రసాదాల విక్రయం ద్వారా రూ. 1,72,425, అన్నదా నం ద్వారా రూ. 2,31,791, విరాళముల ద్వారా రూ. 1000 ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ చంద్రశేఖర్ ఆ ప్రకటనలో తెలియజేశారు.



కోనలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

రాపూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన క్షేత్రంలో పవిత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం ఉదయం స్వామివార్లకు చతుస్థానార్చన, వేద, దివ్య ప్రబంధ పారాయణ, విశేష హోమాలు, నివేదన, శాత్తుముర్రై నిర్వహించారు. సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, శాత్తుముర్రై ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించామని పెంచలకోన ఆలయ ఉపకమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

స్త్రీశక్తి... విజయోత్సాహం!

వింజమూరులో మహిళల భారీ ప్రదర్శన ● పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అజీజ్



ర్యాలీలో మహిళలతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల, అజీజ్ తదితరులు

వింజమూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చంద్రన్న సూపర్‌సిక్స్ పథకాలు సూపర్‌హిట్ అయ్యాయని, స్త్రీశక్తి పథకం బంపర్ హిట్ అంటూ ఉదయగిరి నియోజకవర్గంలోని నారీమణులు శనివారం వింజమూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బంగ్లా సెంటర్ నుంచి ఎస్వీఎస్ కల్యాణ మండపం వరకు చంద్రన్న నినాదాలతో హోరెత్తించారు. వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తదితర ముఖ్య నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారని అన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నా ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని చంద్రబాబు నెరవేరుస్తున్నారని అన్నారు. గడిచిన సంవత్సర కాలంలో ఉయదగిరిలో సుమారు రూ.200 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పూర్తి చేయడం జరిగిందన్నారు. మహిళల ఉపాధి కోసం ప్రయత్నం చేస్తున్నారని, పరిశ్రమల ద్వారానే అది సాధ్యమన్నారు. అనంతరం ఎస్వీ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ఫ్లెక్సీకి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ చెంచలబాబు యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు మన్నేటి వెంకటరెడ్డి, ఎల్సీ రమణారెడ్డి, ఎంపీపీ శిరీషా తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి,భూదేవి సమేత రంగనాథుడు

కొనసాగుతున్న పవిత్రోత్సవాలు

నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాలు శనివారం నాటికి ఆరో రోజుకి చేరాయి. ఈ సందర్భంగా ఉదయం నిత్యహోమాలు, తీర్థ ప్రసాదాల వినియోగం, సాయంత్రం గోపురోత్సవం, రాత్రి హోమాలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఉభయకర్తలుగా తల్పగిరి రంగనాథస్వామి భక్త బృందం వ్యవహరించింది. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అర్చకులు, సిబ్బంది పర్యవేక్షించారు. కాగా పవిత్రోత్సవాలు ఆదివారం ముగుస్తాయి.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)

సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సన్నాహాలు

వంద మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి టెండర్లు

స్థల సేకరణలో అధికారులు


విద్యుత్ సోలార్ ప్లాంట్(ఫైల్)

నెల్లూరు(జడ్పీ), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. ఇప్పటికే సబ్సిడీపై గృహాలకు సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునేలా పెద్దఎత్తున చర్యలు చేపట్టిన ప్రభుత్వం, తాజాగా ప్రతి జిల్లాలోనూ సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుతో పెద్దఎత్తున విద్యుత్ ఉత్పత్తిని చేసేలా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా జిల్లాలోనూ తొలివిడతలో వంద మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుడుతున్నది. విద్యుత్ శాఖ, నెట్‌క్యాప్ ఆధ్వర్యంలో విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో జిల్లాలో త్వరలో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి.

● **వంద మెగావాట్ల ఉత్పత్తికి శ్రీకారం**

జిల్లాలో సోలార్ విద్యుత్‌ను పెద్దఎత్తున ఉత్పత్తి చేయడం ద్వారా విద్యుత్ సమస్యను పరిష్కరించేలా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పెరుగుతున్న జనాభాతో విద్యుత్ వినియోగం ప్రతిఏటా అధికమవుతూ వస్తోంది. ఏసీలు, కూలర్లు వంటి వాడకంతోపాటు పరిశ్రమల ఏర్పాటవుతుండడంతో విద్యుత్ అవసరం రోజురోజుకు పెరిగిపోతోంది. ఈ సమస్య పరిష్కారానికి సోలార్ విద్యుత్ ఉత్పత్తి ఎంతగానో ఉపయోగపడనుంది. దీంతో జిల్లాలోనూ పెద్దఎత్తున సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నది. దాదాపుగా వంద మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని తొలిదశలో చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా జిల్లాలోని కావలి, సంగం, మర్రిపాడు, సీతారామపురం ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాలను అధికారులు గుర్తిస్తున్నారు. దాదాపుగా అన్నీ ప్రాంతాల్లో 400 నుంచి 500 ఎకరాల మేర ప్రభుత్వ స్థలాలను గుర్తించి వాటిల్లో వంద మెగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తికి శ్రీకారం చుడుతున్నారు. ప్రభుత్వ స్థలాలను ఏర్పాటు చేసి సోలార్ ప్లాంట్లు ప్రైవేటు వ్యక్తుల ద్వారా ఏర్పాటు చేయించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేశారు. ప్రభుత్వ స్థలాలు ఇవ్వడం ద్వారా కాంట్రాక్టర్లకు ఖర్చు తగ్గే అవకాశమున్నందున వారి ద్వారా ప్లాంట్లు ఏర్పాటు చేసి ఒక్కో యూనిట్‌ను రూ.3.17పైసలకు ప్రభుత్వం తీసుకునేలా ప్రణాళికలు రూపొందించారు. దీంతో స్థల సేకరణ పూర్తి కాగానే జిల్లాలో సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. తద్వారా జిల్లాకు భారీగా విద్యుత్ అందుబాటులో ఉండే అవకాశం ఉండడంతో కొంత మేర ధరలు తగ్గడంతోపాటు విద్యుత్ సమస్యను పూర్తిగా అధిగమించే అవకాశముంది.

11న ఆక్వా రైతుల రాష్ట్ర సదస్సు

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న విజయవాడలో ఆక్వా రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నామని, ఈ సదస్సుకు రైతులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య పిలుపు నిచ్చారు. శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పులిగండ్ల శ్రీరాములు అధ్యక్షతన సంఘం జిల్లా ఆఫీసు బ్యారర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే జిల్లాలో రైతులు పండించిన ధాన్యం విక్రయాల్లో రైతులు రూ. 6వేల నుంచి రూ. 4వేలు నష్టపోతున్నారన్నారు. ఈ సమస్యలపై ఈనెల 9న నగరంలోని గాంధీ బొమ్మ నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శులు వెంకట కృష్ణయ్య, గోపసాని రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్ర రాజగోపాల్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్


ప్రముఖ కవి మోపూరి పెంచల నరసింహను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వైద్య ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి తాళ్లూరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వ వైద్య కళాశాల సమావేశ మందిరంలో యూనియన్ సమావేశం జరిగింది. గౌరవ అధ్యక్షుడు నరమాల సతీష్‌కుమార్, గౌరవ సలహాదారుడు కమ్మటి శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మాట్లాడారు. ఉద్యోగుల రివిజన్ కమిషన్‌ను వెంటనే పునరుద్ధరించాలని, ఉద్యోగుల మధ్యంతర భృతి విడుదల చేయాలని, పెండింగ్ కరువు భత్యం, సరెండర్ లీవ్ మొత్తం ఇవ్వాలని, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. అలాగే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించాలని, పారిశుధ్య, భద్రత ఉద్యోగులు వేతనాలు రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ చేసిన కమ్మటి శ్రీనివాసులు, ప్రముఖకవి మోపూరు పెంచలనరసింహలను సన్మానించారు. అనంతరం యూనియన్ కమిటీని ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఉరూజ్, సందానిబాషా, అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రసన్న కుమార్, పార్థసారధి, కార్యనిర్వాహక కార్యదర్శిగా శ్రీనివాసరావు, కోశాధికారిగా గౌడ భాస్కర్ తదితరులు ఎంపికయ్యారు.

ఎస్సీ రుణాల రికవరీపై చర్చ

● పాల్గొన్న కులసంఘాల నాయకులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్‌లో రూ.కోట్ల రుణాలు వసూలు కాకుండా ఉండటంతో, వాటిని రికవరీ చేయలేని అధికారులు ఎట్టకేలకు కులసంఘం నాయకులతో శనివారం చర్చ జరిపారు. రుణ రికవరీకి సహకరించాలని వారిని కోరారు. ఒక అజెండా తయారు చేసి రావాల్సిన రుణ రికవరీపై చర్యలు తీసుకుంటామని వారు నాయకులకు తెలిపారు.

● **అందచేసిన రుణాల వివరాలు**

టీడీపీ ప్రభుత్వంలో 2016 నుంచి 19 సంవత్సరాల మధ్య ఎన్ఎస్ఎఫ్‌డీసీ(ట్రాన్స్‌పోర్టు) పథకం కింద 79 మందికి రూ.9.16కోట్ల విలువైన ఇన్నోవా కార్లను, 70 మందికి రూ. 3.84 కోట్ల విలువైన ఎతియాస్ కార్లను అంద చేసింది. ఇతర వాహనాల కింద ఎక్స్‌కవేటర్‌కు రూ.30లక్షలు, ఈ- ఆటోలు తదితర 39 వాహనాలకు రూ.2.21 కోట్ల రుణాలను అంద చేసింది. ఇటుకల తయారీ, మినీడైయిరీ, కిరాణా షాపులు తదితరాలకు 615 మందికి రూ. 10.44కోట్లు అందచేసింది. భూమి కొనుగోలు పథకం కింద 118 మందికి రూ.2.55 కోట్లు అందచేసింది. మొత్తం 921 యూనిట్లకు రూ.28.22కోట్లను సబ్సిడీ రుణాలుగా అందచేసింది. ఈ రుణాల్లో ఇప్పటి వరకు రూ. 5.33 కోట్లను మాత్రమే అధికారులు రాబట్ట గలిగారు. ఇంకా రూ. 22.88 కోట్లు రికవరీ చేయాల్సి ఉంది. అదే విధంగా ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ(ట్రాన్స్‌పోర్టు) పథకం కింద రెండు ఇన్నోవా వాహనాలకు రూ.24.90లక్షలు, ఒక యతియాస్ కారుకు రూ. 6.12 లక్షలు, 14 ట్రాక్టర్లు-ట్రాలీలకు రూ. 69.20లక్షలు, 99 ఈ-ఆటోలకు రూ.84.11 లక్షలు, 18 ఎండీసీఎంఎస్‌లకు రూ. 1.97 కోట్లు, రుణాలుగా అందచేశారు. ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ(నాన్-ట్రాన్స్‌పోర్టు-సెల్ఫ్ ఎంప్లాయిమెంటు) పథకం కింద 256 మందికి రూ. 2.33కోట్లు రుణాలుగా ఇచ్చారు. ఈ పథకం కింద మొత్తం 390 యూనిట్లకుగాను రూ. 6.15కోట్లు అందచేశారు. ఈ మొత్తంలో కేవలం రూ. 36.99 లక్షలను మాత్రమే రాబట్ట గలిగారు. ఇంకా రూ.5.78కోట్లు రాబట్టాల్సి ఉంది. ఈ రెండు పథకాల కింద ఇంకా రూ. 28.66 కోట్లను లబ్ధిదారుల నుంచి రాబట్టాల్సి ఉంది. ఇన్నోవా, ఎతియాస్, జేసీబీ వాహనాలను తీసుకునే సమయంలో లబ్ధిదారులకు కొందరు ప్రభుత్వ ఉద్యోగులు ష్యూరిటీ ఇచ్చారు. మరికొందరు తమ ఇంటి పత్రాలను, భూమి పత్రాలను ష్యూరిటీ కింద ఎస్సీ కార్పొరేషన్ అధికారులకు ఇచ్చారు.

● **రికవరీపై చర్చ**

ఈ రుణాల విషయమై కుల సంఘం నాయకులతో ఎస్సీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీ శోభారాణి, ఈవో మురళిలు శనివారం నాటి చర్చలో సమగ్రంగా వివరించారు. అనంతరం సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాట్లాడుతూ లబ్ధిదారులు తీసుకున్న రుణాలకు సంబంధించి కేంద్ర రుణాన్ని రద్దు చేయాలని, రాష్ట్ర వాటా రుణాన్ని వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మాలమహానాడు మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి చేను సుజాత మాట్లాడుతూ తమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు స్వర్ణ వెంకయ్య ఎస్సీ కార్పొరేషన్ ముఖ్యకార్యదర్శి శ్రీనివాస నాయక్‌ను కలిసి వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా రుణ సమస్యను పరిష్కరించాలని కోరారన్నారు. ఈ విషయంలో వన్‌టైం సెటిల్ మెంటే మంచిదని చెప్పారు. నాయకుల మాటలు విన్న అధికారులు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళతామని చెప్పారు. చర్చలో ఎస్సీ కమిషన్ మాజీ డైరెక్టర్ బద్దెపూడి రవీంద్ర, నాయకులు కొప్పోలు రఘు, జెల్లి పద్మాకర్, బాలచెన్నయ్య, కుడుముల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.


చర్చలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శోభారాణి, ఈవో మురళి తదితరులు

గిరిజనుల భూ సమస్యలపై మండలాల్లో సదస్సులు పెట్టాలి

ప్రత్యేక గ్రీవెన్స్‌లో వివిధ సంఘాల నాయకులు

బలవంతంగా భూములు సేకరించం : సబ్‌కలెక్టర్

కందుకూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం మండలాల్లో సదస్సులు పెట్టాలని వివిధ సంఘాల నాయకులు కోరారు. కందుకూరు సబ్ కలెక్టరు దామెర హిమవంశీ నేతృత్వంలో స్థానిక కార్యాలయంలో శనివారం గిరిజనుల భూసమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ గిరిజనసంఘం, రైతు కూలీ సంఘం (సీపీఎం), గిరిజనుల చైతన్యవేదిక నాయకులు జీవీబీ కుమార్, ఆర్. మోహన్, వీసం విజయ్, జీ. వెంకటేశ్వర్లు, మల్లవరపు లలిత, కత్తి మహేశ్వరి, బాలకోటయ్య, మాణికల సుజాత తదితరులు మాట్లాడుతూ మండలస్థాయిలో సదస్సులు నిర్వహించటం ద్వారా అక్కడికక్కడ సమస్య పరిష్కారం అయ్యేలా చొరవ తీసుకుని గిరిజనులకు న్యాయం చేయాలని సబ్ కలెక్టరుకు విజ్ఞప్తిచేశారు. కోటిరెడ్డికుంట, తిరుపతికుంట, మర్రిచెట్ల సంఘాల గిరిజనులకు ఇంటిస్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించుకునేలా చూడాలన్నారు. కరేడులోని ఇందిరానగర్, మర్రిచెట్టు సంఘాలలో యానాదులకు శ్మశాన సౌకర్యం కల్పించాలన్నారు. చిల్లాకాలువ పోరంబోకు భూములకు కన్వర్షన్ చేయించి రామకృష్ణాపురం గిరిజనులు పట్టాలు మంజూరు చేయించాలని, మన్నేటికోట శంకర్‌నగర్ కాలనీలో అన్యాక్రాంతమైన గిరిజనుల భూములను వారికే ఇవ్వాలని, ఉలవపాడులో గిరిజనుల కోసం ప్రత్యేకంగా ఆధార్‌కేంద్రం పెట్టించాలని కోరారు.

● **మా భూములు ఇవ్వం**

కరేడులోని వివిధ గిరిజన సంఘాలకు చెందిన యానాదులు సబ్ కలెక్టరు వద్ద ఇండోసోల్ సోలార్ కంపెనీ కోసం తమ భూములు ఇవ్వబోమని, ఇళ్లను కూడా ఖాళీచేసే ప్రశ్నేలేదని స్పష్టంచేశారు. భూమి పోతే తమ జీవన విధానం దెబ్బతింటుందని, తమకు భృతి లేకుండా పోతుందని యానాదులు ఆందోళన వ్యక్తంచేశారు. కరేడులో 30 పోలీసుయాక్టును తక్షణం ఎత్తివేయాలని గిరిజనులు కోరారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ భూములను బలవంతంగా ఎవరూ తీసుకోరని, మీజోలికి ఎవరూ రారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజనసంఘాల నాయకులు సీహెచ్ దుర్గాప్రసాద్, నాంచార్లు, కత్తి సుజాత, పొట్లూరి రవి పాల్గొన్నారు.

ఇండియా స్కిల్స్ కాంపిటేషన్ గోడపత్రిక ఆవిష్కరణ


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆనంద్ తదితరులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఇండియా స్కిల్స్ కాంపిటేషన్-2025 గోడపత్రికను కలెక్టర్ ఆనంద్ శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా స్కిల్ డెవపల్‌మెంట్ అధికారి అబ్దుల్ ఖయ్యూం మాట్లాడుతూ 16 నుంచి 25 ఏళ్ల లోపు యువత ఈ కాంపిటేషన్‌కు అర్హులని పేర్కొన్నారు. ఈనెల 30 లోగా ఈకేవైసీ ధ్రువీకరణతోపాటు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఈ పోటీల్లో పాల్గొన్నవారికి అంతర్జాతీయ స్థాయిలో అవార్డు అందచేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టూరిజం అధికారి ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా ఉచిత వైద్యం

రూ. 25 లక్షల విలువైన చికిత్సలు

ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్


విలేకరులతో మాట్లాడుతున్న శివప్రసాద్

నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్సలు అందించటమే యూనివర్సిల్ హెల్త్ పాలసీ లక్ష్యమని ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్. శివప్రసాద్ తెలిపారు. శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని 1.63 లక్షల కుటుంబాలకు 2493 నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా 31 స్పెషాలిటీ విభాగాల్లో నిర్వహించే 3257 రకాల చికిత్సలు ఈ పాలసీ ద్వారా పూర్తిగా ఉచితమని చెప్పారు. హైబ్రిడ్ మోడ్‌లో బీమా సంస్థల ద్వారా నగదు రహిత వైద్యసేవలు రాష్ట్ర ప్రజలకు అందించేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. ఊబకాయం, మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి వ్యాధులు ఘననీయంగా పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ముందు చూపుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ పాలసీకి శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు రూ. 8480 కోట్ల అంచనాలతో నివేదిక తయారు చేసి, రూ. 4948 కోట్ల నాబార్డు నిధులు, సీఎస్ఎస్, కేంద్రం ప్రత్యేక నిధులను పొంది రూ. 1451 కోట్ల ఖర్చు చేసి గత ప్రభుత్వం 25 శాతం కూడా పనులు చేపట్టలేదన్నారు. పిపిపి విధానం ద్వారా 10 వైద్య కళాశాల నిర్మాణం, నిర్వాహణ వాటికి అనుబంధంగా ఆసుపత్రులను ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో ముందుకు తీసుకురావటం శుభపరిణామన్నారు.

మరిన్ని సేవలపై ప్రత్యేక దృష్టి

● విద్యుత్‌శాఖ ఎస్ఈ


మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులకు సమర్థవంతమైన మరిన్ని సేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ వీ. విజయన్ తెలిపారు. నగరంలో శనివారం సబ్ డివిజన్ అధికారులు, సిబ్బందితో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా చేపట్టిన వినూత్న కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశకాలను, కంపెనీ ఆర్థిక స్థితిని క్షేత్రస్థాయి సిబ్బందికి ఆయన తెలియజేశారు. ప్రభుత్వం ఆశించిన విధంగా వినియోగదారులకు సకాలంలో ఎలాంటి సేవలు అందిస్తున్నారో తెలుసుకోవడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెలాఖరులోపు అన్నీ విద్యుత్ స్తంభాలపై ఉన్న అనధికార కేబుల్స్‌ను తొలగించాలన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తున్నప్పటికి సంస్థకు రావాల్సిన రెవెన్యూ బకాయిలు పూర్తిగా రావడం లేదని, ప్రతి ఒక్కరూ రెవెన్యూ వసూళ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. వెంటనే వేగవంతమైన వసూళ్ల కోసం చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది ప్రవర్తన, భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. వినియోగదారులకు మరింత నాణ్యమైన, భద్రతాయుక్తమైన విద్యుత్ సేవలను అందించే దిశగా ప్రతిఒక్కరూ అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో టౌన్ ఈఈ ఎం శ్రీధర్, డీఈలు సునీల్‌కుమార్, కిరణ్, ఏఈలు విజయ్, కృష్ణవేణి, మునిశేఖర్, సురేష్, గోపాలకృష్ణ, నస్రుల్లా, రమణ, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

దుత్తలూరులో క్షుద్రపూజల కలకలం


ఇంటి ముంగిట పసుపు, కుంకుమ

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలోని కట్టకిందపల్లి కాలనీలో శనివారం క్షుద్రపూజల కలకలం రేగింది. వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన వరాలు అనే వ్యక్తి ఇంటి ముందు ముగ్గు వేసి కుంకుమ, పసుపుతోపాటు బొమ్మ గీసి పూజలు చేసినట్లుగా ఉండటంతో కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. శనివారం ఉదయం అటుగా వెళుతున్న ఒక మహిళ పూజలు చేసినట్లు గుర్తించి ఇంటి యజమాని వరాలకు విషయం తెలిపింది. అతను ఇంటి బయటకు వచ్చి చూసి పోలీసులకు సమాచారం అందజేశాడు. దీంతో ఏఎస్ఐ ఇస్మాయిల్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. క్షుద్రపూజలు చేసిన వారిని పోలీసులు గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలి

● జేసీకి రైతు సంఘం వినతి


జేసీ కార్తీక్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నేతలు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పుట్టి రూ. 19,720కి కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం డిమాండ్ చేసింది. శనివారం జేసీ కే. కార్తీక్‌కు ఆ సంఘం నాయకులు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు దామా అంకయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు షాన్‌వాజ్ మాట్లాడారు. జిల్లాలో ఆగస్టు 15 నుంచి ఎడగారు ధాన్యం మార్కెట్‌లో వస్తున్నదన్నారు. ఇప్పటికే 30 శాతం వరికోతలు పూర్తయ్యాయని చెప్పారు. అయితే చెన్నై, కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాల వ్యాపారులు ధాన్యాన్ని పుట్టికి రూ. 16,700లకు మాత్రమే కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రోకర్లు, ఏజెంట్‌లు నేరుగా కల్లాల్లోకి వెళ్లి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. సివిల్‌సప్లయ్ శాఖ అధికారులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయక పోవటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ప్రధాన కార్యదర్శి జీ. రమణయ్య, వై. మధు తదితరులు పాల్గొన్నారు.

9న అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

సంగం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాల పోస్టులకు 9వ తేదీ ఉదయం 10 గంటలకు ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఐసీడీయస్ సూపర్‌వైజర్ సునీలత ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు కాల్ లెటర్లు అందచేశామన్నారు. ఇంటర్వ్యూలకు అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికేట్‌లతో హాజరు కావాలని ఆమె తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10243
వెండి కిలో ధర	రూ. 127700
వెండి ఒక గ్రాము	రూ. 130.70

న్యూస్ బాక్స్

నేడు వెంగమాంబ ఆలయం మూత

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడ గ్రామంలో ఉన్న వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయం చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మూసివేయనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంట వరకే భక్తులకు అమ్మవారి దర్శనం ఉంటుందని, ఒంటి గంట నుంచి తరువాత రోజు 5 గంటల వరకు ఆలయాన్ని మూసివేయడం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం కూడా ఉండదన్నారు. ఆలయ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం 8వ తేదీ 8 గంటలకు ఆలయం తలుపులు తెరువబడతాయన్నారు. కావున భక్తులు గమనించాలని ఆమె కోరారు.

బీసీ హాస్టళ్ల స్థితిగతులపై ఎమ్మెల్యే సమీక్ష

వింజమూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో బీసీ వెల్ఫేర్ హాస్టల్ డిపార్మెంట్ అడ్వైజరీ కమిటీ అధికారులతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని బీసీ హాస్టళ్ల స్థితిగతులు, విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందుతున్న సదుపాయాలు, మెరుగైన విద్యా, భోజన, వసతి సదుపాయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కమిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

సంగం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరులోని ఆస్తానా ఏ నూరియా దర్గాలో పీఠాధిపతి హజరత్ అల్ హజ్ షేక్ షా బిషా నూరి సాహెబ్ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం తెల్లవారుజామున గంధ మహోత్సవం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంధ మహోత్సవాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆస్తాన ఏ నేరియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘ నిధులతో పారిశుధ్య పనులు చేయాలి

అనంతసాగరం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు మంజూరైన 15వ ఆర్థిక సంఘం నిధులతో పారిశుధ్య పనులు చేయించాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. శనివారం కామిరెడిపాడు సచివాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఉద్యోగులతో సమావేశం నిర్వహించి గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించాలని ఆదేశించారు. వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు.

అనుమతులు గోరంత... తవ్వేది కొండంత

● చెరువులను కొల్లగొడుతున్న మట్టి మాఫియా ● ప్రభుత్వ ఆదాయానికి గండి ● పట్టించుకోని అధికారులు

వింజమూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణం, మండలంలో మట్టి మాఫియా రాజ్యమేలుతోంది. ముఖ్యంగా పట్టణంలోని చెరువుల్లో అనుమతులు కొంత తీసుకుని ఎక్కువ మొత్తంలో మట్టిని తరలిస్తున్నారు. ఇదివరకు ట్రాక్టర్లు, టిప్పర్లతో తోలుకునేవారు. ఇప్పుడు భారీ యంత్రాలతో చెరువులను తవ్వేస్తున్నా అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా చెరువుల్లో పెద్ద పెద్ద గుంతలు తీసి మట్టి తోలడంతో చెరువు నీరు కూడా తూముల వరకు రాకుండా ఆ గుంతల్లోనే చేరి ఇంకిపోతున్నాయి. దీనివలన రైతులకు కూడా తీవ్ర నష్టం జరుగుతోంది. ఆయకట్టు కింద ఉన్న రైతులకు నీరు వచ్చే మార్గం లేకుండా పోయింది. పట్టణంలో సామాన్య ప్రజలకు మట్టి బంగారంలా తయారైంది. వారికి అందుబాటులో లేకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి మాఫియాను కట్టడి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.


భారీ వాహనాలతో తరలిస్తున్న చెరువు మట్టి

గురువులను ప్రతిఒక్కరూ గౌరవించాలి



ఉదయగిరి: ప్రధానోపాధ్యాయురాలు రజియాబేగంను సన్మానిస్తున్న ఎంపీపీ, సర్పంచి


సీతారామపురం: భోగ్యం శ్రీనివాసులును సత్కరిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు



మర్రిపాడు: సన్మానం అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు

ఉదయగిరి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మూలె పద్మజ, సర్పంచ్ పావులూరి సామ్రాజ్యం, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు సర్వేపల్లి రాధాకృష్ణన్‌కు నివాళులర్పించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే గురువులను ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. అనంతరం మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించి ప్రశంసాపత్రాలు, మెమోంటోలు అందజేశారు. ఈకార్యక్రమంలో విశ్రాంత ఎంఈవో గానుగపెంట ఓబుల రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు మూలె వినయ్‌రెడ్డి, ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**సీతారామపురం:** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిదని సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో మండల విద్యాశాఖాధికారులు షేక్ మస్తాన్‌వలి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న 15 మందిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ముఖ్య అతిథులుగా ఎంపీటీసీ పాలగిరి అల్లూరురాజు, సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ జాషువా తదితరులు పాల్గొన్నారు.

●**మర్రిపాడు:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో-1 తిరుపతయ్య, ఎంఈవో-2 ధనలక్ష్మి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్, ఎంఆర్‌సి రాజేంద్రకుమార్, రమేష్, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●**చేజర్ల :** స్థానిక ఎంపిడీవో కార్యాలయంలో శనివారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా 16 మంది ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్‌పిపి తూమా టి విజయభాస్కర్ రెడ్డి, ఎమ్‌పిడీవో అమర్, సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, మాజీ ఎమ్‌పిపిలు రావి పెంచల రెడ్డి, బాలిరెడ్డి రమాదేవి ఎమ్‌ఈవోలు ఇందిర, మస్తాన య్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం


ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ మండల నాయకులు

సీతారామపురం, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బిట్-1 సచివాలయంలో మండల టీడీపీ నాయకుల చేతుల మీదుగా శనివారం నూతన ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలో ఆధార్ కేంద్రం లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆధార్ కోసం ఉదయగిరి, పోరుమామిళ్ళ, పలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని ఇటీవల ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన చొరవతో ఆధార్ కేంద్రం మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ నాయకలు దేవర వెంకటేశ్వర్లు, జాషువా, వీకాష్‌బాబు, ఇజ్రాయిల్, చంద్రరెడ్డి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ


మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ లక్ష్మణ స్వామి

సీతారామపురం, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రెండు ప్రైవేటు మద్యం దుకాణాలను శనివారం ఉదయగిరి ఎక్సైజ్ సీఐ లక్ష్మణస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మద్యం నిల్వలతో పాటు రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు అందించారు. మద్యం షాపుల నిర్వహణలో సమయ పాలన పాటిస్తూ ఎమ్మార్పీ ధరకే మద్యం విక్రయాలు జరపాలని, బెల్టు షాపులు నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ఎక్సైజ్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిల్లకర్ర వేలం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిమ్మారెడ్డిపల్లి సచివాలయ ప్రాంగణంలో శనివారం నక్కలగండి ప్రాజెక్టు ఛైర్మన్ వేమూరి మధు ఆధ్వర్యంలో చిల్లకర్ర వేలంపాట నిర్వహించారు. తొలుత నివేదికలను వివరించిన ఏఈ ఆదిరమేష్ 517, 518 సర్వే నంబర్లలోని చిల్లకర్రను నరికేందుకు గాను ప్రభుత్వ నిబంధనల మేరకు రూ. 2.70 లక్షలుగా నిర్ధారించి ధరావత్తు నగదును పాటదారుల నుంచి రూ. 5వేలు చొప్పున స్వీకరించారు. కోర్టు, రెవెన్యూ పరిధిలోని భూముల్లో చిల్లకర్ర నరికేందుకు అనుమతులు లేవన్నారు. అలాగే నిబంధనలను అతిక్రమించిన సమయంలో అనుమతులను రద్దుచేయడం జరుగుతుందని హెచ్చరించారు. అనం తరం నిర్వహించిన వేలంలో పాటదారులు పోటీ పడడంతో ఆద్యంతం ఉత్కంఠగా సాగింది. చివరికి కాకొల్లువారిపల్లి గ్రామానికి చెందిన సందిరెడ్డి నాగేశ్వరరావు గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 4లక్షలకు వేలం పాడి అనుమతులు దక్కించుకున్నారు. కార్యక్ర మంలో కొండాపురం ఏఈ వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల ఆందోళన


ఆందోళన చేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ఉదయగిరి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం సచివాలయ ఉద్యోగులు రాష్ట్రకమిటీ పిలుపు మేరకు శనివారం ఆయా సచివాలయాల ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన చేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ గతంలో వలంటీర్లు ఒక క్లస్టర్‌కు పరిమితమై నిర్వహించిన విధు లను సచివాలయ ఉద్యోగులకు ఒకటి కంటే ఎక్కువ క్లస్టర్లు మ్యాప్ చేసి బలవంతంగా విధులు అప్పగించడం దారుణమన్నారు. రాష్ట్రంలో గత్యంతరం లేక 1.25 లక్షల మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని, లేదంటే దశలవారీ పోరాటాలు చేస్తామని వారు హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలి


జడ్పీ సీఈవోను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జడ్పీ సీఈవో మోహన్‌రావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అలాగే అన్ని రకాల రికార్డులను ఎలాంటి లోపాలు లేకుండా సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరువ అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సంబంధిత రికార్డులను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. కాగా విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు మర్యాద పూర్వకంగా జడ్పీ సీఈవోను కలిసి శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి అభినందించారు. మెట్ట ప్రాంతాన్ని దృష్టిలో ఉంచుకొని నిధుల మంజూరులో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోపిశ్రీనివాస్, జడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర, మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌యాదవ్, వైఎస్ ఎంపీపీ దేవనబోయిన మధు, తెలుగు యువత అధ్యక్షుడు ముజ్జె లక్ష్మీనారాయణ, పొద మాధవరావు, ఆరికొండ వెంకటరత్నం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నక్కలగండి రిజర్వాయర్ కాలువ పనుల పరిశీలన


కాలువ పనులు పరిశీలిస్తున్న డీఈ చంద్రమౌళి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నక్కలగండి రిజర్వాయర్ పరిధిలో చేపట్టిన కాలువ పనులను శనివారం ఉదయగిరి ఇరిగేషన్ డీఈ చంద్ర మౌళి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 4.76లక్షల ప్రపంచ బ్యాంకు నిధులతో ఇటీవల ఎడమ కాలువకు సంబంధించిన పూడి కతీత, జంగిల్ క్లియరెన్స్ పనులను చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా పనుల్లో నాణ్యతను పరిశీలించినట్లు తెలిపారు. ముందస్తుగానే పనులు చేపట్టడంతో రైతులకు సకాలంలో సాగునీరు అందించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఈ వేణు, ప్రాజెక్టు ఛైర్మన్ వేమూరి మధు, మాజీ పీఏసీఎస్ ఛైర్మన్ కామేపల్లి వెంకటరత్నం, టీడీపీ నాయకులు గొడుగులూరి మాల కొండ్రాయుడు, సందిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొండ ప్రాంతం పరిశీలన


మైనింగ్ అనుమతులకు సంబంధించిన కొండ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హరిబాబు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరికుంటపాడు, భాస్కరాపురం గ్రామాల పరిధిలో మైనింగ్ అనుమతులకు సంబంధించిన కొండ ప్రాంతాన్ని శనివారం కాలుష్య నియంత్రణ బోర్డు జిల్లా అధికారి బీ హరిబాబు పరిశీలించారు. ఇటీవల కొంతమంది స్థానికులు తవ్వకాలను రద్దుచేయాలని కోరుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడం జరిగింది. దీంతో స్పందించిన ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన తన బృందంతో 233,1 సర్వే నంబర్లను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం నివేదికలను ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచు దిలీప్‌కుమార్, బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు ఆంద్రా పరంధామిరెడ్డి, వినియోగదారులు, మానవ హక్కుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ చల్లగాలి వెంకటమోహన్ తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

'నా భర్త నుంచి రక్షణ కల్పించండి'

ఐఎఫ్ఎస్ అధికారి భార్య వేడుకోలు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నా భర్త అయిన ఐఎఫ్ఎస్ అధికారి బుడిగ శ్రీనివాసులురెడ్డి నుంచి తనకు, తన పిల్లలకు రక్షణ కల్పించాలని భార్య రేణుక శనివారం మహిళా పోలీసులను కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐఎఫ్ఎస్ అధికారి బుడిగి శ్రీనివాసులరెడ్డితో 2013లో తనకు వివాహమైందన్నారు. అప్పటికే ఆయనకు రెండు పెళ్లిళ్లు అయ్యాయని, వాటిని దాచిపెట్టి మూడో వివాహం చేసుకున్నడన్న విషయం ఆలస్యంగా తెలిసిందన్నారు. తమకు ఇద్దరు పిల్లలున్నారని, అయితే తనను వదిలించుకొని మరో వివాహం చేసుకునేందుకు ఆయన కొంతకాలంగా ప్రయత్నిస్తున్నాడని ఆమె తెలిపింది. శుక్రవారం సాయంత్రం నాకుమారునికి జ్వరంగా ఉండటంతో వైద్యశాలకు తీసుకెవెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి భర్త, కుటుంబసభ్యులు ఇంటికి తాళాలు వేసి తనను ఇంటి బయట ఉంచారన్నారు. నా తల్లిదండ్రులు కడపలో ఉండటంతో రాత్రంతా పిల్లలతో కలిసి ఇంటి బయటే ఉన్నానని ఆవేదన వ్యక్తం చేశారు. మరో వివాహం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న నా భర్తపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆమె మహిళా పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ కేసీహెచ్ రామారావుకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చొరవ తీసుకొని ఆమెను తిరిగి ఇంట్లోకి వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. ఈ విషయంపై డీఎస్పీని వివరణ కోరగా గతంలోనే భర్తపై ఫిర్యాదు చేశారని, కోర్టులో కేసు నడుస్తోందన్నారు. ప్రస్తుత ఫిర్యాదుపై లీగల్ ఒపీనియన్ తీసుకుంటామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత


బియ్యాన్ని పట్టుకొన్న అధికారులు

అనంతసా గరం, సెప్టెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): మండ లంలోని మినగ ల్లు పంచాయతీ నల్లరాజుపాలెం వద్ద ఉత్తరకా లువ రహదారిపై అక్రమంగా ఆటో లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు శనివారం పట్టుకొన్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కాలువ వద్ద కాపుకాసి మినీ ఆటోలో తరలిస్తున్న 71 బస్తాలు 3.5 టన్నుల బియ్యం పట్టుకొన్నట్లు వెల్లడించారు. డ్రైవర్ పరార్ అయ్యాడు. ఈదాడిలో సాగరం డీటీ నాగలక్ష్మీ, పౌరసరఫరాల శాఖ డీటీ అజమతుల్లాఖాన్ సిబ్బంది పాల్గొన్నారు. స్వాధీనం చేసుకొన్న బియ్యాన్ని ఆత్మకూరు గొడౌన్‌కు తరలించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

వెంకటాచలం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనికేపల్లి సమీపంలోని ఒక ప్రైవేటు లే అవుట్ వద్ద గల పేకాట స్థావరంపై శనివారం సాయంత్రం పోలీసులు దాడులు నిర్వహిం చారు. వెంకటాచలం సీఐ సుబ్బారావు, ఎస్ఐ ఆంజనేయులు సిబ్బంది తో కలిసి ఐదుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1240 నగదు స్వాధీనం చేసుకున్నారు.

రెండు మోటార్ బైక్‌ల ఢీ

ఇద్దరికి గాయాలు


వేణుగోపాల్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

ఉదయగిరి, సెప్టెం బరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో రెండు మోటార్‌బైక్‌లు ఢీ కొని ఇద్దరికి గాయాలైన సంఘటన శనివారం చోటు చేసు కొంది. వివరాల మేరకు.. కడప జిల్లా బద్వేల్‌కు చెం దిన వేణుగోపాల్ పని నిమిత్తం మోటార్‌బైక్‌పై ఉదయగిరికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా కళాశాల నుంచి ఇంటికెళుతున్న ఓ విద్యార్థి బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వేణుగోపాల్‌కి తీవ్ర గాయాలు కాగా, విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వేణుగోపాల్‌ను చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఆత్మకూరుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి స్వల్ప గాయాలు


చికిత్స పొందుతున్న ఆషిక్

మనుబోలు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జాతీయ రహదారిపై వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్‌కే ఆషిక్ అనే విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. వీరంపల్లి గ్రామానికి చెందిన ఆషిక్ మనుబోలు జూనియర్ కళాశాలలో చదువుతున్నాడు. కళాశాలకు వెళుతున్న విద్యార్థిని నెల్లూరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో ఆషిక్‌కు స్వల్ప గాయాలు కాగా, మనుబోలు పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యం అందించి, మెరుగైన వైద్యం కోసం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):గుర్తుతెలియని వ్యక్తి నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్ సమీపంలో మృతిచెందాడు.ఈ ఘటన శనివారం చోటుచేసుకుంది. మృతుడు సుమారు 50 ఏళ్ల వయసు కలిగి, బులుగురంగు టీషర్టు, బులుగురంగు షార్ట్ వేసుకుని ఉన్నాడు. మృతదేహాన్ని గమనించిన స్థానికులు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ కి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు చిన్నబజారు పోలీసులను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు కోరారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	115
స్కిన్ చికెన్	212
స్కిన్‌లెస్	234

కోడిగుడ్ల ధర (100): 545

నల్లతుమ్మ చెట్ల కోసం చెరువు గట్టు తొలగించడం దారుణం

దగదర్తి (బిట్రగుంట) సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొందరు తమ స్వప్రయోజనం కోసం చెరువులో నల్లతుమ్మ చెట్లను నరికేందుకు చెరువు గట్టును తొలగించి వేయడం దారుణమని గ్రామస్తులు అన్నారు. దగదర్తి చెరువులో అక్రమంగా కొన్ని రోజుల నుంచి నల్లతుమ్మ చెట్లను నరికేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీంతో దగదర్తి ట్యాంక్ నీటి సంఘం అధ్యక్షుడు మాలేపాటి సుధాకర్‌నాయుడు స్థానిక రైతులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా చెరువులో చెట్లను నరకడమే కాకుండా, గట్టును తొలగించిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక టీడీపీ నాయకులు కంచర్లకృష్ణ, వట్టిగుంటగోపాల్ డిమాండ్ చేశారు. వర్తినేనికృష్ణ, చావ వెంకటేశ్వర్లు, ముప్పాల సురేష్, మువ్వ సుధాకర్ నాయుడు, బత్తల ఏడుకొండలు, షేక్ బషీర్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల గ్రీవెన్స్‌కు అర్జీల వెల్లువ

భూ సమస్యలకు సంబంధించి 62 వినతుల స్వీకరణ

కావలి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపడుతున్నా.. కింది స్థాయిలో చాలావరకు పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో గిరిజనుల భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా శనివారం కావలి ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. కావలి డివిజన్‌లోని పలు మండలాల నుంచి గిరిజనులు అధిక సంఖ్యలో తరలివచ్చారు కనీసం కుర్చీలు, షామియానాలు కూడా ఏర్పాటు చేయకపోవటంతో బాధితులు ఇబ్బందులు పడ్డారు. ఎండలో కార్యాలయం మెట్లమీద కూర్చుని నిరీక్షించారు. భూ సమస్యలపై 62 అర్జీలను అందజేశారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్‌లో ఆయా మండల తహసీల్దార్ కార్యాలయాలలో అర్జీలు స్వీకరిస్తున్నా.. ప్రత్యేక గ్రీవెన్స్‌కు 62 అర్జీలు వచ్చాయంటే అధికారులు సమస్యలను పరిష్కరించడం లేదన్నది స్పష్టమవుతోంది.


ఆర్డీవోకు వినతిపత్రాలు అందజేస్తున్న గిరిజనులు

కార్మిక చట్టాలను సవరించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మోహనరావు

కావలి(టౌన్) సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను తెచ్చి రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు మోహనరావు ఆరోపించారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ 5వ పట్టణ మహాసభ జరిగింది. సీఐటీయూ నాయకురాలు జయంతి కుమారి అధ్యక్షతన జరిగిన మహాసభలో ముఖ్య వక్తలుగా మోహనరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్‌కే రెహనా బేగం పాల్గొని ప్రసంగించారు. కార్మిక యూనియన్లకు సీఐటీయూ అండగా నిలబడి, హక్కుల సాధనకు ఎనలేని కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ దేశవ్యాప్తంగా పోరాటాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పెంచలయ్య, పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్, సుభాషిణి, సౌందర్య, వెంకటేశ్వర్లు, రూబెన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు మోహనరావు

న్యూస్ బాక్స్



ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు 35 శాతం రాయితీ

● ఏపీఎం ఎం. కృష్ణయ్య

ఉలవపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక మహిళా పొదుపు గ్రూపు సభ్యులకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు నెలకొల్పుటకు కేంద్ర ప్రభుత్వం పీఎంఈజీవైలో భాగంగా బ్యాంకుల నుంచి 35 నుంచి 40 శాతం వరకు రాయితీ రుణాలు ఇవ్వనున్నట్లు ఏపీఎం కృష్ణయ్య తెలిపారు.

ముఖాముఖి

?. మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సాహకాలు అందిస్తుంది.

!: గ్రామీణ ప్రాంత మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకునేందుకు గ్రూపు మహిళలు ముందుకు వస్తే యూనిట్ ధరను బట్టి రూ. లక్ష నుంచి రూ.20 లక్షల వరకు బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయి.

?. మండలంలో ఎన్ని స్వయం సహాయక పొదుపు గ్రూపులు ఉన్నాయి.

!: 1510 స్వయం సహాయక మహిళా పొదుపు గ్రూపులు, 45 గ్రామా సమైఖ్య సంఘాలు ఉన్నాయి. వీవోఏల ఆధ్వర్యంలో గ్రామ సమైఖ్య పొదుపు సంఘాలు పనిచేస్తున్నాయి.

?. ఎస్సీ ఎస్టీలకు అందించే ఉన్నతి పరిస్థితి ఏమిటి.

!: మండలంలోని ఎస్సీ, ఎస్టీ పొదుపు గ్రూపు సభ్యులకు ఇప్పటికి రూ. 16 లక్షల వరకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించడం జరిగింది. మొత్తం మీద సభ్యులు ఉన్నతి రుణాన్ని సకాలంలోనే చెల్లిస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందచేయాలి


తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజాసత్తా నేత శోభన్‌బాబు

కావలి,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి) అర్హులైన లబ్ధిదారులందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తప్పకుండా అందేలా చూడాలని ప్రజా సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు పులగర శోభన్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం కావలి తహసీల్దార్ పీ శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్‌లకు వినతిపత్రాలు అందజేశారు. ఒంటరి మహిళలు, పురుషులకు రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఒంటరి మహిళలకు 35 సంవత్సరాలకే పింఛన్ ఇవ్వాలన్నారు. నివేశన స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సత్తా నాయకులు మూరబోయిన శ్రీరామచంద్రయ్య, ఎం లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు అభినందనలు

కందుకూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): కందుకూరుకు చెందిన జీ ఈశ్వరమ్మ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకుంది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌ల చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఈశ్వరమ్మను పలువురు అభినందించారు.


ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌ల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఈశ్వరమ్మ

వైసీపీని వీడి టీడీపీలోకి...

ఎమ్మెల్యే సమక్షంలో 110 కుటుంబాల చేరిక

జలదంకి, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం చామదల పంచాయతీలో 110 కుటుంబాలకు చెందిన వైసీపీ సానుభూతిపరులు శనివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మునగాల వెంకటేశ్వరరెడ్డి, జలదంకి మండల తెలుగుయువత అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డిల ఆధ్వర్యంలో వీరు చామదల నుండి ర్యాలీగా ప్రత్యేక వాహనాలలో వింజమూరుకు తరలివెళ్లారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సమక్షంలో టీడీపీలో చేరారు. వీరికి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పసుపు కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో కోట కోటిరెడ్డి, మాజీ ఎంపీటీసీ వి రమణయ్య, డి చెంచురామయ్య, పి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. సంక్షేమ పథకాలతో పాటు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నారని, అందుకే తాము టీడీపీలో చేరామని వారు తెలిపారు. చామదల పంచాయతీలో ఎమ్మెల్యే తోడ్పాటుతో స్థానిక టీడీపీ నేతలు మునగాల వెంకటేశ్వరరెడ్డి, మునగాల తిరులమరెడ్డిలు పార్టీలకతీతంగా అభివృద్ధి చేస్తూ ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారన్నారు. చామదలలో వైసీపీని వీడి భారీసంఖ్యలో టీడీపీలో చేరడంతో నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి పెద్ద షాక్ తగిలినట్లయింది.


ఎమ్మెల్యే కాకర్ల సురేష్, అబ్దుల్ అజీజ్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ సానుభూతిపరులు, నాయకులు

వీఎన్‌ఆర్‌పేటలో ఓల్టేజ్ సమస్య ఇక లేనట్లే..

బిట్రగుంట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో ఇక నుంచి విద్యుత్‌లో ఓల్టేజ్ సమస్య ఉండదని ఆ శాఖ ఏఈ జడరాయ శనివారం తెలిపారు. లో ఓల్టేజ్ సమస్యను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకుపోవడంతో వెంటనే సమస్యను పరిష్కరించాలని ఏఈని ఆదేశించారు. లైన్‌మెన్ బ్రహ్మయ్య, సిబ్బందితో కలిసి మసీదు సమీపంలో నూతన 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి లేల్లపల్లి సుధీర్‌బాబు ప్రారంభించారు. విద్యుత్ లోడ్ డివైడ్ చేయడంతో విశ్వనాథరావుపేట ప్రజలకు ఇక లోఓల్టేజ్ సమస్య ఉండదని ఏఈ తెలిపారు.

క్లస్టర్ మ్యాపింగ్‌కు వ్యతిరేకంగా సచివాలయ ఉద్యోగుల నిరసన

కావలి, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): వలంటీర్లు చేసే క్లస్టర్ మ్యాపింగ్‌ను సచివాలయ ఉద్యోగుల చేత చేయించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శనివారం పట్టణంలో సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. వలంటీర్లు చేస్తుండిన సేవలను కూడా సచివాలయ ఉద్యోగులపై మోపి పనిభారం పెంచుతు న్నారన్నారు. దీనిపై గ్రామ సచివాలయ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక తీర్మానం మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపా లిటీలలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో ఒక క్లస్టర్‌కు ఒక వలంటీర్ చేస్తున్న అన్ని సర్వేలను ఇప్పుడు ఒక సచివాలయ ఉద్యోగికి 2-3 క్లస్టర్లు ఇచ్చి సర్వేలు చేయిస్తున్నారన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

మాలకొండ ఆదాయం రూ. 8,35,851

వలేటివారిపాలెం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 8,35,851 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్ల ద్వారా రూ. 6,650, కుంకుమార్చన ద్వారా రూ. 19,560, వివాహముల ద్వారా రూ. 4 వేలు, తలనీలాలు ద్వారా రూ. 47,875, వాహన పూజలు ద్వారా రూ. 3400, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 3,07800, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ. 450, రూముఅద్దెలు ద్వారా రూ. 31,990, కవర్లు ద్వారా రూ. 8,900, లడ్డుప్రసాదం ద్వారా రూ. 1,72,425, అన్నదానం ద్వారా రూ. 2,31,791, విరాళముల ద్వారా రూ. 1000 ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ చంద్రశేఖర్ తెలియజేశారు.

జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ చర్యలు

● కావలి నుంచి ఉలవపాడుకు వచ్చే మార్గం మూసివేత

ఉలవపాడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణలో భాగంగా ఉలవపాడు జాతీయ రహదారిపై డేంజర్ రూట్ మార్గాలను స్థానిక ఎస్సై అంకమ్మ, హైవే అథారిటీ లోకల్ రూట్ అధికారి నర్సింగరావు, రోడ్డు సేఫ్టీ సూపర్‌వైజర్ మధుబాబులు శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా జాతీయ రహదారిపై కావలి నుంచి ఉలవపాడులోకి వాహనాలు వచ్చే ఓపెన్ డివైడర్‌ను సిమెంట్ బ్లాక్‌లతో మూసేశారు. మలుపు తిరిగి ఉలవపాడులోకి వచ్చే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నందున ఆ మార్గాన్ని మూసివేసినట్లు పోలీసులు తెలిపారు. కావలి వైపు నుంచి పట్టణంలోకి వచ్చే వాహనదారులు కొల్లురూపాడు అండర్ పాస్ బ్రిడ్జి మార్గాన తిరిగి ఉలవపాడులోకి రావాలని, ఈ విషయాన్ని వాహన చోదకులు గమనించాలని కోరారు. ప్రమాదాల నివారణ బట్టి సౌత్ బైపాస్ మలుపు మార్గం మూసివేతపై పునరాలోచన ఉంటుందని రోడ్డు భద్రతా అధికారులు తెలిపారు.


నార్త్ బైపాస్‌పై మూసేసిన యూటర్న్ మార్గం

విజ్ఞానం.. విషయ పరిజ్ఞానం అందించేదే అసలైన విద్య

● విద్యావేత్త, మోటివేటర్ వాసిరెడ్డి అమరనాథ్

కావలి(టౌన్)సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి) విజ్ఞానంతో పాటు విషయ పరిజ్ఞానం అందించేదే నిజమైన విద్య అని ప్రముఖ విద్యావేత్త మోటివేటర్ వాసిరెడ్డి అమరనాథ్ (బాలమిత్ర)పేర్కొన్నారు. స్థానిక పాతూరులోని శ్రీచైతన్య జూనియర్ కళాకశాల ఆధ్వర్యంలో పాతూరు శివాలయం పక్కన ఉన్న కల్యాణ మండపంలో విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ఆత్మవిశ్వాసం, సంకల్పంతో పాటు, భావ వ్యక్తీకరణ, సృజనాత్మక నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లుకోదర్, డైరెక్టర్లు ఎస్ వెంకయ్య, నందనవనం మధుసూదన్‌రావు, వీవీఎస్ ప్రసాద్, మట్టా కొండయ్య, మల్లికార్జునరావు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఉపన్యసిస్తున్న వాసిరెడ్డి అమరనాథ్

ఎమ్మెల్యే ఇంటూరిని కలిసిన పోకూరి

కందుకూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ డెరెక్టర్‌గా నియమితుడైన పోకూరి రాంబాబు శనివారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావును మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు డెరెక్టర్‌గా అవకాశం కల్పించటంలో కీలకపాత్ర పోషించిన ఎమ్మెల్యేని శాలువాతో ఘనంగా సత్కరించారు.


ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును శాలువాతో సత్కరిస్తున్న పోకూరి రాంబాబు

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులది కీలక పాత్ర

అల్లూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయులు పరోక్షంగా కీలక పాత్ర పోషిస్తారని తహసీల్దారు లక్ష్మీనారాయణ అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా అల్లూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానసభ ఏర్పాటు చేశారు. ఉత్తమ ఉపాధ్యాయులు కే. హనుమంతరావు, ఏ. ఝాన్సీ, బీ. చంద్రశేఖర్, ఎస్‌డీ పర్వీన్, వై రమేష్, పి సంపూర్ణమ్మ, పీ నాగరాజు, కే సాధనలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రనాథ్, రామకృష్ణ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

భావిభారత పౌరులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

లింగసముద్రం, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని తహసీల్దార్ ఎం కోటేశ్వరరావు, ఎంపీడీఓ కట్టా శ్రీనివాసులు పేర్కొన్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం సాయంత్రం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో మండ లంలోని 15 మంది సీనియర్ ఉపాధ్యాయులను తహసీల్దార్ కోటేశ్వరరావు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ-1, 2 కె మాల్యాద్రి, ఎంవి శివకు మార్‌లు ఘనంగా సన్మానించారు.


విద్యా వనరుల కేంద్రంలో సీనియర్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తహసీల్దార్ కోటేశ్వరరావు, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవోలు

ఆంజనేయరాజుకు ప్రత్యేక జ్యూరీ అవార్డు

అల్లూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అల్లూరుకు చెందిన ఆంజనేయరాజుకు మరో ప్రత్యేక జ్యూరీ అవార్డు దక్కింది. ఏకపాత్రాభినయం పోటీల్లో ఆయనకు ఈ అవార్డు దక్కింది. ఈనెల 5న శ్రీ రామకృష్ణ నాట్యమండలి ఆధ్వర్యంలో విజయవాడలో జరిగిన పోటీల్లో ప్రదర్శించిన 'పెద్దోడు' పాత్రకు ఆయనకు ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు.


ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా అవార్డును స్వీకరిస్తున్న ఆంజనేయరాజు

బీజేపీ మండలాధ్యక్షుడిగా కర్రా మధు



కలిగిరి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ అండ్‌బీ బంగ్లా వద్ద శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల అధ్యక్ష ఎంపిక జరిగింది. మండలంలోని క్రాకుటూరుకి చెందిన కర్రా మధును కలిగిరి మండల బీజేపీ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మధు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ప్రగతిని ఇంటింటికీ తీసుకెళ్ళి మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బ్రహ్మారెడ్డి, కలిగిరి సొసైటీ ఛైర్మెన్ కదిరి వెంకట రంగారావు, నాయకులు నందనవనం ప్రభాకర రావు, మేకపాటి మాల్యాద్రి, బెల్లంకొండ మాల్యాద్రి పాల్గొన్నారు.

విద్యార్థులకు జీవిత పాఠాలు నేర్పించాలి

● ఉపాధ్యాయులకు సబ్ కలెక్టరు హిమవంశీ సూచన

కందుకూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు విద్యార్థులకు పుస్తకాల్లోని పాఠ్యాంశాలతో పాటు జీవిత పాఠాలు నేర్పించాలని కందుకూరు సబ్ కలెక్టరు దామెర హిమవంశీ సూచించారు. కందుకూరు మండలంలో ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం శనివారం సాయంత్రం స్థానిక డీఆర్సీలో జరిగింది. ఎంఈఓ ఎం నాగ కుమారశర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సబ్ కలెక్టరు మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా బోధనలో కూడా వినూత్న పద్ధతులు అవలంభించాలన్నారు. ఈసందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇంటూరి సుశీల, ఎంఈఓ 2 సుబ్బారెడ్డి, చినగంజాం ఎంఈఓ అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


సబ్‌కలెక్టరు హిమవంశీని సత్కరిస్తున్న విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం

కలిగిరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో శనివారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పీ కరుణాకరన్ (పీజీటీ బాటనీ)ను ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపల్ ఏ శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కరుణాకరన్‌ను సన్మానిస్తున్న మోడల్ స్కూల్ సిబ్బంది

యోగాతో 'ఆరోగ్య' భాగ్యం


కొండాపురం, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): నిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్య భాగ్యం లభిస్తుందని స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీ రాధాక్రిష్ణ పేర్కొన్నారు. రోజూ యోగా చేస్తే మానసిక, శారీరక ప్రశాంతత లభిస్తుందని, విద్యార్థులకు చదువుపై ఏకాగ్రత ఉంటుంద న్నారు. శనివారం గరిమెనపెంట జడ్పీ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు, యోగా గురు రవిచంద్ర విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. విద్యార్థులతో పాటు పలువురు ఉపాధ్యాయులు యోగాసనాలు సాధన చేశారు.


యోగాసనాలు చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆర్టీవోగా మురళీధర్ బాధ్యతల స్వీకరణ

కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి): కావలి రీజనల్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్‌గా పి. మురళీధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఆర్టీవోగా పనిచేసిన వై. సుధాకర్ రెడ్డి జూలై 31వ తేదీన పదవీ విరమణ చేశారు. అప్పటి నుండి ఎంవీఐ సుందర్‌రావు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం ఆర్టీవోగా పని చేస్తున్న మురళీధర్ బదిలీపై కావలికి వచ్చారు. దీంతో ఎంవీఐ సుందర్‌రావు, అసిస్టెంట్ ఎంవీఐలు కరుణాకర్, లక్ష్మీభాయ్ ఆర్టీవోను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో కార్యాలయ ఏవో సుభాషిణి, సిబ్బంది సునేత్ర, సుబ్రమణ్యం, రమేష్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు


ఆర్టీవో మురళీధర్‌ను సన్మానిస్తున్న ఎంవీఐ సుందర్‌రావు



బైబై.. వెళ్లొస్తాం..



వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా 11వ రోజైన శనివారం తిరుపతి నగరంలోని పలు ప్రాంతాల వినాయక విగ్రహాలను వినాయకసాగర్‌లో నిమజ్జనం చేశారు. ఇందులో భాగంగా తన వాహనమైన మూషికంపై ఊరేగుతూ వచ్చిన వినాయక విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



ఆలయాల రూటులో 'స్త్రీశక్తి' ఫుల్

● ట్రిప్పుల పెంపునకు ఆర్టీసీ ప్రతిపాదన

స్త్రీశక్తి పథకానికి విశేష ఆదరణ లభిస్తోంది. ఆర్టీసీ రోజువారి గణాంకాల ద్వారా ఈ విషయం స్పష్టమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ఈ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. జిల్లాలో శ్రీకాళహస్తి, తిరుచానూరు, అప్పలాయగుంట, గుడిమల్లం, కాణిపాకం పుణ్యక్షేత్రాల ప్రభావం స్త్రీశక్తి పథకంపై కనిసిస్తోంది. ఆయా ఆలయాల మార్గంలో పెరిగిన రద్దీయే ఇందుకు తార్కాణం. మరోపక్క రోడ్లు అనుకూలంగా ఉండడంతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా బస్సులు సమయపాలన పాటించగలుగుతున్నాయి. దీంతో ప్రయాణానికి మహిళలు పోటీపడుతున్నారు.ఫలితంగా బడులకు, కూలి పనులకు కొందరు సమయానికి చేరలేకపోతున్నారు. ఉదయం 7నుంచి 10గంటల మధ్య, సాయంత్రం 3.30నుంచి రాత్రి 8గంటల మధ్య ఈ ప్రభావంతో రద్దీ ఏర్పడుతోంది. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి, సత్యవేడు, నగరి, కాణిపాకం, పుత్తూరు-చిత్తూరు నడిచే పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల ట్రిప్పులు పెంపునకు అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. ఏడు డిపోలకు మూడు బస్సులు చొప్పున అదనంగా ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను కోరారు.

- తిరుపతి(ఆర్టీసీ), ఆంధ్రజ్యోతి



రమ్య తల్లి చందన

తల్లికి భారమై..

● ఆరునెలల ఆడబిడ్డను కాలువలో పడేసిన వైనం

● పేదరిక నేపథ్యంలో హతమార్చినట్లు తల్లి వెల్లడి

మృత్యు ఒడికి చిన్నారి



హత్యకు గురైన రమ్య

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): పేదరికం అన్ని దారులనూ మూసేస్తుందంటారు. కష్టాలు మనిషిని మార్చేస్తుందంటారు. ఈ పరిస్థితుల్లోనే ఓ తల్లి పేగుబంధం మరిచిపోయింది. తాగుబోతు భర్త, పేదరిక పరీక్షలతో వేగలేక ఆరు నెలల పసికందును కాలవలో పడేసి చంపేసింది. అలిపిరి సీఐ రాంకిషోర్ కథనం మేరకు....తిరుపతి సమీపంలోని కొరమేనుగుంటలో భూపతి, చందన దంపతులు ఉంటున్నారు. రెక్కాడితేగాని డొక్కాడని బతుకులు. వీరికి ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె దివ్యకు ఐదేళ్లు, రెండవ కుమార్తె కిత్యకు నాలుగేళ్లు. మూడోసారి మగబిడ్డ పుడతాడని భావించారు. ఈ క్రమంలో ఆరు నెలల క్రితం మూడో కుమార్తె రమ్య పుట్టింది. దీనికితోడు భర్త తాగుడుకు బానిసై కుటుంబాన్ని పట్టించుకునేవాడు కాదు. కుటుంబ పోషణ భారమంతా చందనపై పడిం ది. హాస్టల్లో పనిచేసే అత్తకు వచ్చే ఆరేడు వేల రూపాయలు కూడా ఎటూ చాలడం లేదు. ఈ నేపథ్యంలో మూడో సంతానం రమ్యను ఎలాగైనా వదిలించుకోవాలని చందన నిర్ణయించుకుంది. శనివారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లే సమయంలో పసిబిడ్డను మురికి కాలువలో పడేసి చంపేసింది. తర్వాత బిడ్డ కనిపించలేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్పీ హర్షవర్ధనరాజు వెంటనే డీఎస్పీ భక్తవత్సలం, సీఐ రాంకిషోర్‌ను వెంట పెట్టుకుని ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. ఎక్కడా ఆచూకీ దొరకలేదు. చందన, భూపతిలను అదుపులోకి తీసుకుని విచారించారు. బిడ్డను తీసుకుని బహిర్భూమికి వెళ్తుండగా చంకలోని చిన్నారి రమ్య మురికి కాలువలోకి జారి పడిపోయిందని చందన చెప్పింది. ఆమె చెప్పిన చోట డ్రోన్ల సహాయంతో గాలించినా దొరకలేదు. భార్యాభర్తలు భిన్న కోణాల్లో చెబుతుండటంతో పోలీసులు అనుమానించారు. తమదైన శైలిలో వారిని విచారించారు.దీంతో చంద న నేరం అంగీకరించింది. పేదరికంతో కుటుంబ పోషణ కష్టంగా మారి మనసు కఠినం చేసుకుని తానే ఆరు నెలల రమ్యను కాలువలో పడేసి చంపేశానని చెప్పింది. పోలీసులు రమ్య మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీశారు. నిందితురాలు చందనను అరెస్ట్ చేసి, హత్య కేసు నమోదు చేశారు.

నేడు ముక్కంటి ఆలయంలో

గ్రహణ కాలాభిషేకం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చంద్రగ్రహణాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం రాత్రి గ్రహణ కాలాభిషేకం నిర్వహించనున్నారు. శ్రీకాళహస్తీశ్వరస్వామి నవగ్రహాలను కవచంగా ధరించి ఉంటారు.అందుకే ఈ క్షేత్రం లో గ్రహణ కాల సమయంలోనూ ఆలయాన్ని తెరచి ఉంచి, విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. ఆదివారం రాత్రి రాహుగ్రస్త చంద్రగ్రహణం స్పర్శాకాలం 9.50గంటలకు ప్రారంభమై అర్ధరాత్రిపైన 1.31గంటలకు మోక్షకాలంతో గ్రహణం విడుపుగా ఆగమ పండితులు నిర్ణయించారు. ఈ మేరకు మధ్యకాలం 11.41 గంటల సమయంలో ఆలయంలోని మూలమూర్తులకు అభిషేకం నిర్వహించనున్నారు. అర్ధరాత్రి వేళ కావడంతో భక్తులకు అనుమతి కల్పించడంలేదని అధికారులు ప్రకటించారు. కేవలం అర్చకులు మాత్రమే ఏకాంతంగా గ్రహణ కాల అభిషేకం నిర్వహించనున్నారు.



పోలేరమ్మ ఆలయ చైర్మన్‌గా మురళీకృష్ణ

వెంకటగిరి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ దేవస్థానం చైర్మన్‌గా గొల్లగుంట మురళీకృష్ణను నియమిస్తూ శనివారం రాష్ట్ర దేవదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌తో పాటు ఆలయ పాలకవర్గ సభ్యులుగా తాండవ చంద్రశేఖర్, పుట్టా శివప్రసాద్, టీవీ కృష్ణ, జే.యామిని, పులికొల్లు జగదీశ్వరి, కలపాటి నాగమణి, అనిల్ రామారావు, సి.తిరుపతిరావు, మదనపల్లి సావిత్రమ్మ, సత్యసాయి కిరణ్‌మయి, తిండివనం ప్రసాద్‌లను నియమించింది. చైర్మన్ మురళీకృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో చైర్మన్ పదవి ఇచ్చినందుకు దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో చైర్మన్‌గా పనిచేసిన అనుభవంతో పోలేరమ్మ జాతరను విజయవంతం నిర్వహిస్తామని చెప్పారు.

ఆక్రమణ చెర నుంచి

ఆలయ భూములకు విముక్తి

● 130 ఎకరాల రికార్డుల అప్పగింత

● భూముల విలువ రూ.25 కోట్లు



తలకోన ఈవో రవీంద్రరాజుకు భూ హక్కుల పత్రాలను అందజేస్తున్న తహసీల్దార్ పరమేశ్వర స్వామి

ఎర్రావారిపాలెం,సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి):వివిధ ఆలయాలకు చెందిన రూ.25 కోట్ల విలువ చేసే భూములకు విముక్తి కలిగింది. వివరాలిలా.. మండలంలో పది రెవెన్యూ గ్రామాల పరిధిలో గతంలో 29 ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు, నిర్వహణకు పలువురు దాతలు భూములు విరాళంగా అందజేశారు. ఇవి రెవెన్యూ రికార్డుల్లో ఆలయాల పేరిట నమోదై ఉన్నాయి. కాలక్రమేణా కొన్ని ఆలయాల భూములు ఆక్రమణకు గురయ్యాయి. వీటని సాగు చేసుకుంటూ తమ భూమిగానే ఆక్రమణదారులు చెప్పుకొస్తున్నారు. తొలినాళ్లలో కొందరు పంటలో సగం ఆదాయం ఆలయాలకు అందజేశారు. వారి తరం కనుమరుగవ్వడంతో తర్వాత వారసులు ఇవ్వడం మానుకున్నారు. పైగా సాగులో ఉన్న భూములకు పట్టాలు పొందేందుకు ప్రయత్నించారు. తలకోన ఆలయ ఈవో రవీంద్రరాజు ఇటీవల ఈ విషయంపై దృష్టి సారించారు. తహసీల్దార్ పరమేశ్వరస్వామితో సంప్రదించారు. భూముల వివరాలను అందజేశారు. భూములపై తిరిగి ఆలయాలకు యాజమాన్య హక్కులు కల్పించేలా మ్యుటేషన్ కోరుతూ దరఖాస్తు చేశారు. తహసీల్దార్ రికార్డులను లోతుగా పరిశీలించి 130 ఎకరాల భూములకు మ్యుటేషన్ ఆమోదించారు. ప్రస్తుతం ఈ భూముల మార్కెట్ విలువ రూ.25 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు. శనివారం భూముల పత్రాలను తహసీల్దార్ తలకోన ఈవోకు అందజేశారు.





గత ఏడాది వరదలకు నెర్రికాలువకు పడిన గండి

అధికారులు మరోచోట కొట్టిన గండి

నెర్రికాలువ పనుల్లో

చేతివాటం

● గండిపడిన చోట కాకుండా మరో వైపు కాంక్రీట్ వాల్ నిర్మాణం

● చర్చికి అనుకూలంగా పనులు

● ఇరిగేషన్ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు



చర్చివైపు నిర్మిస్తున్న కాంక్రీట్ వాల్

సూళ్లూరుపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే నెర్రికాలువ పనుల్లో ఇరిగేషన్ అధికారులు చేతివాటం చూపుతున్నారు. గత ఏడాది నవంబరు, డిసెంబరు మాసాల్లో వచ్చిన వరదలకు జీఎన్‌టీ రోడ్డు పక్కనే ఉన్న లూథరన్ చర్చి వెనకాల నెర్రికాలువకు భారీ గండిపడింది. దీంతో నీరంతా పక్కనే ఉన్న కాళంగి నదిలోకి వెళ్లింది. అప్పటి నుంచి నెర్రికాలువలో సాగునీటి పారుదల లేక సూళ్లూరు, పల్లిపాలెం, గోపాల్‌రెడ్డిపాలెం, పాములమట్టి, కారిజాత, వాటంబేడు, గొల్లల మొలువు గ్రామాల రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో నెర్రికాలువ గండిని పూడ్చి కట్టలు కోతకు గురికాకుండా రూ.39 లక్షలతో కాంక్రీట్ వాల్ నిర్మాణం చేపట్టేందుకు ఇరిగేషన్ అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను సైతం ప్రారంభించారు. అయితే పడిన గండిని పూడ్చకుండా ఇరిగేషన్ అధికారులు మరోచోట గండి కొట్టి కాంక్రీట్ వాల్ నిర్మాణం చేపట్టారు. దీన్ని పరిశీలించిన సమీప గ్రామ రైతులు ఇరిగేషన్ అధికారులను నిలదీశారు. అధికారులు సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సైతం ఇరిగేషన్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చర్చివైపు కాంక్రీట్ వాల్ నిర్మాణం ఆపేసి, కోతకు గురయ్యే వైపు నిర్మించాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే చెప్పినా పట్టించుకోని అధికారులు

ఎఫ్‌డీఆర్ నిధులతో నిర్మిస్తున్న కాంక్రీట్ వాల్‌ను ఇటీవల ఎమ్మెల్యే పరిశీలించారు. చర్చివైపు కాంక్రీట్ వాల్ నిర్మాణం ఆపేసి, గండిపడిన చోట వెంటనే పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అయినా చర్చివైపు కాంక్రీట్ వాల్ పనులు జరుగుతూనే ఉన్నాయి. గండిపడిన చోట కాకుండా చర్చి భవనానికి ఉపయోగపడేలా కాంక్రీట్ వాల్ నిర్మాణం చేపట్టడంలో మతలబు ఏమిటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జూలైలోనే గంగనీరు విడుదల చేసినా గండి పూడ్చకపోవడంతో మావిళ్లపాడు వద్ద నెర్రికాలువ గేట్లు తీయలేదు. వ్యవసాయ పనుల సీజన్ ప్రారంభమైనా చెరువులకు చుక్కనీరు చేరకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. అధికారుల తీరుతో సాగునీరందక నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గ్రానెట్ లారీ, ఆర్టీసీ బస్సు ఢీ

● 30 మందికి గాయాలు

చంద్రగిరి, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రానెట్ లోడ్డుతో వెళుతున్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో 30 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిలోని అగరాల వద్ద శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. శ్రీకాళహస్తి డిపోకు చెందిన అద్దె బస్సు శుక్రవారం రాత్రి బెంగళూరు నుంచి శ్రీకాళహస్తికి వస్తోంది. తెల్లవారుజామున అగరాల వద్ద ముందు వెళుతున్న గ్రానైట్ లారీని ఢీకొంది. బస్సులో ప్రయాణిస్తున్న 30 మంది గాయపడ్డారు. ఇందులో బస్సు కండక్టర్ రత్నంతో సహా 10మందికి తీవ్ర గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు తెలిపారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌ల ద్వారా చంద్రగిరి ఏరియా, తిరుపతి రుయా ఆస్పత్రులకు తరలించారు. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బస్సు కొంత నిదానంగా రావడంతోనే ప్రాణ నష్టం జరగలేదని తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.







లారీని ఢీకొన్న బస్సు - చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ప్రతిష్ఠాత్మకంగా మహిళా సాధికార సదస్సు

- ఏర్పాట్లను పరిశీలించిన అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ -

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి కేంద్రంగా ఈనెల 14, 15 తేదీల్లో జాతీయ మహిళా సాధికార సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామని అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ అన్నారు. సదస్సు జరగనున్న రాహుల్ కన్వెన్షన్ సెంటర్, చంద్రగిరి కోటను కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుతో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. అంతకు ముందు జిల్లా అధికారులతో సదస్సు ఏర్పాట్లపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ సదస్సుకు దేశవ్యాప్తంగా ఉన్న మహిళా ప్రజాప్రతినిధులు హాజరై రెండు రోజులపాటు మహిళల సమస్యలపై సుదీర్ఘంగా చర్చిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇస్తున్నందున ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని, ఎలాంటి లోటుపాట్లూ లేకుండా చూడాలన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఈ సదస్సుకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, మంత్రులు వస్తుండటంతో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 14వ తేదీ రాత్రి సదస్సుకు విచ్చేస్తున్న ప్రజాప్రతినిధులు చంద్రగిరి కోటను సందర్శించి, లైటింగ్ షోను వీక్షించి, అక్కడే డిన్నర్ చేస్తారని తెలిపారు. ఎవరికి కేటాయించిన విధులు వారు నిర్వహించి సదస్సును విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, డీఆర్వో నరసింహులు, ఏఎస్పీ రవి మనోహరాచారి, జిల్లా గ్రామ పంచాయతీ అధికారిణి సుశీలాదేవి పాల్గొన్నారు.



రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్, కలెక్టర్ వెంకటేశ్వర్









తిరుమలలో పలువురు న్యాయమూర్తులు

తిరుమల శ్రీవారిని శనివారం వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు దర్శించుకున్నారు. వీరిలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మన్మధరావు, జస్టిస్ ఈఎస్ ఇందిరేష్, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిరుధ పీ మాయి, మేఘాలయ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వైద్యనాథన్ ఉన్నారు. ఇంకా నటుడు దాసరి అరుణ్‌కుమార్ కూడా స్వామిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వ దర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ బాటగంగమ్మ ఆలయ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.3.49 కోట్లు


శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 69,531

తలనీలాలు సమర్పించినవారు: 31,439



యోగా.. శరీరాన్నీ, మనసునూ నియంత్రించే గొప్ప ప్రక్రియ. మనదేశ సాంస్కృతిక సంపదలో భాగమైన ఈ ఆరోగ్య ప్రక్రియ ఇప్పుడు బాగా ప్రాచుర్యం పొందింది. అయితే 55ఏళ్ల క్రితమే దీని ప్రాధాన్యతను గుర్తించి అనుసరించారు గూడూరుకు చెందిన కట్టా మురళీకృష్ణ. ఆసనాలను అతి సులభంగా వేస్తూ ఆ రోజుల్లోనే అబ్బురపరిచేవారు. ఆయన వారసత్వాన్నే పుణికి పుచ్చుకున్న ఆయన మనవడు మరో అడుగు ముందుకేశాడు. యోగాలో కష్టతరమైన శలభాసనం వేసి గిన్నిస్ రికార్డు సాధించాడు. అందరి దృష్టినీ ఆకట్టుకుని ఔరా అనిపించుకుంటున్నాడు. యోగాసనాలు వేసేవారికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడీ పిన్న వయస్కుడు.

- గూడూరు, ఆంధ్రజ్యోతి





ఎమ్మెల్యే సునీల్‌కుమార్ చేతుల మీదుగా గిన్నిస్ రికార్డు అందుకుంటూ..

శలభాసనంలో శెభాష్.. ద్వారకేష్

● యోగాలో క్లిష్టమైన ప్రక్రియలో గిన్నిస్ రికార్డు

కట్టా వెంకట ద్వారకేష్.. గూడూరు సొసైటీ కాలనీకి చెందిన ఈ యువకుడు బెంగళూరులో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. యోగా రంగంలో అద్భుతాలు ఆవిష్కరిస్తున్నాడు. ఇతని తాత మురళీకృష్ణ 1970లో ఆధ్యాత్మిక యోగ వెల్ఫేర్ అసోసియేషన్‌ను స్థాపించారు. యోగా గురువుగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈయన కుమారుడు రాజ్‌కుమార్ కూడా తండ్రిని అనుసరించాడు. 1996లో గూడూరులో మొదటిసారిగా యోగా, జిమ్ సెంటర్‌ను ప్రారంభించారు. పట్టణ ప్రజలకు ఆరోగ్యకరమైన శరీరసౌష్టవ సాధన, యోగాల గురించి లోతుగా పరిచయం చేశాడు. తండ్రి, తాతల ప్రభావంతో ద్వారకేష్ కూడా ఇదే రంగంపై మక్కువ పెంచుకున్నాడు. చిన్నతనం నుంచే కఠోర ఆసనాలను సాధన చేయడం ప్రారంభించాడు. శరీరాన్ని ధనుస్సులా వంచేయడం అలవాటు చేసుకున్నాడు. 2006లో చెన్నైలో జరిగిన జాతీయస్థాయి యోగ పోటీలలో ప్రతిభను చాటి బంగారు పతకాన్ని సాధించాడు. పాఠశాల నుంచి అన్ని స్థాయిల్లోనూ నిర్వహించే యోగాసనాల పోటీలలో ప్రతిభ చాటాడు ద్వారకేష్. ఈ క్రమంలోనే గతేడాది చెన్నైలో నిర్వహించిన ఖేలో ఇండియాలో 345 నిమిషాల పాటు శలభాసనం వేసి అబ్బురపరిచాడు. ప్రపంచ గిన్నిస్ బుక్ రికార్డులో స్థానం సాధించగలిగాడు.

ఏమిటీ ఆసనం :

క్రమశిక్షణ, కఠోరసాధన, మనో ధైర్యం, మానసిక సమతుల్యత, ఊపిరి నియంత్రణపై పట్టు ఉంటే తప్ప ఈ తరహా శలభాసన ప్రక్రియలో ఎక్కువసేపు కొనసాగడం కష్టమని యోగా నిపుణులు చెబుతారు. ఈ యోగా భంగిమలో బోర్లా పడుకుని కాళ్లు, ఛాతిని నేల నుంచి పైకి లేపుతూ మిడత ఆకారాన్ని అనుకరిస్తారు. అందుకే దీనిని మిడతాసనం అని కూడా అంటారు. ఈ ఆసనం వెన్నెముక, వీపు కండరాలకు బలాన్నిస్తుందని ద్వారకేష్ చెబుతాడు. జీర్ణ ప్రక్రియ మెరుగుపరచడంలోనూ, పొత్తి కడుపులో పేరుకుపోయే కొవ్వును కరిగించడానికి దోహదపడుతుందంటున్నాడు. అనేక అనారోగ్య సమస్యలను యోగా ద్వారా నయం చేసుకోవచ్చునని అంటున్నాడీ యువకుడు. భవిష్యత్తులో యోగా శిక్షణ సంస్థలను ఏర్పాటు చేసి యువతను యోగాసనాల వైపు నడిపించాలనే లక్ష్యమని ఆంధ్రజ్యోతికి వివరించాడు ద్వారాకేష్.



శలభాసనంలో ద్వారకేష్

మల్లికార్జున ప్రయాణం స్ఫూర్తిదాయకం

సత్యవేడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):ఒకప్పుడు శ్రీసిటీలో ఉద్యోగిగా పయనం మొదలు బెట్టి, నేడు పారిశ్రామికవేత్తగా ఎదిగిన మల్లికార్జున ప్రస్థానం యువతకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తిదాయకమని వీఎస్ఎన్ఎల్ మాజీ ఛైర్మన్, ఏపీ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు, పద్మశ్రీ డాక్టర్ టి.హనుమాన్ చౌదరి కొనియాడారు.శ్రీసిటీలో శుక్రవారం వ్యక్తిగత పరిశుభ్రత ఉత్పత్తులు (శానిటరీ న్యాప్‌కిన్స్) తయారు చేసే స్మైల్ ఎకో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ప్రారంభమైంది.హనుమాన్ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, స్మైల్ ఎకో మేనేజింగ్ డైరెక్టర్ పరుచూరి మల్లికార్జున సమక్షంలో పరిశ్రమను లాంఛనంగా ప్రారంభించారు. రూ.20 కోట్ల పెట్టుబడితో స్థాపించిన ఈ ప్లాంట్ ఏడాదికి 259.2 మిలియన్ల శానిటరీ న్యాప్‌కిన్‌లను తయారు చేస్తుంది. దాదాపు 200 మందికి పైగా ఉద్యోగాలు లభిస్తాయి. ఇక్కడి ఉత్పత్తులను దేశీయ మార్కెట్‌తో పాటు విదేశాలకు ఎగుమతులు చేస్తారు. పరిశ్రమ ఎండీ మల్లికార్జునను శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. వరదయ్యపాళెం మండలంలోని వెంకటరెడ్డి కండ్రిగకు చెందిన మల్లికార్జున ఒకప్పుడు శ్రీసిటీలో ఉద్యోగిగా పయనం మొదలు బెట్టి, నేడు పారిశ్రామికవేత్తగా ఎదగడం యువతకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సంతోషదాయకమన్నారు.



పరిశ్రమను ప్రారంభిస్తున్న హనుమాన్ చౌదరి

తిరుమలలో శాస్త్రోక్తంగా చక్రస్నానం

తిరుమల, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): అనంత పద్మనాభవ్రతం సందర్భంగా శనివారం ఉదయం తిరుమల శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంత పద్మనాభవ్రతాన్ని ఏటా భాద్రపద శుక్ల చతుర్దశి రోజున నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయంలో ఉదయం పూజలు చేసిన తర్వాత సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి వరాహస్వామి ఆలయం చెంత ఉన్న పుష్కరిణిలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేపట్టారు. అనంతరం చక్రస్నానాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

● 35 గ్రాముల బంగారు, 350 గ్రాముల వెండి ఆభరణాల స్వాధీనం

బంగారు వెండి ఆభరణాలతో దొంగ అరెస్టు చూపిస్తున్న గాజుల మండ్యం పోలీసులు →



రేణిగుంట, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): రాత్రిపూట ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగ తంగముత్తును గాజులమండ్యం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు వివరాల మేరకు.. గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021 నుంచి రాత్రిపూట ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీ చేస్తున్న ఘటనలు నమోదయ్యాయి. వేలిముద్రల ఆధారంగా తమిళనాడు రాష్ట్రం తూత్తుకుడి జిల్లా తిరుచెందూరుకు చెందిన తంగముత్తు ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. మరో చోరీకి సన్నద్ధమయ్యే క్రమంలో శనివారం ఉదయం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద తచ్చాడుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 35 గ్రాముల బంగారం, 350 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన గాజులమండ్యం సీఐ మంజునాథ్‌రెడ్డి, ఎస్‌ఐ సుధాకర్, హెడ్ కానిస్టేబుళ్లు గోపి, రాజేష్, సుబ్రహ్మణ్యం, కానిస్టేబుళ్లు వేణుగోపాల్, గోపి, మణి, మురళి వాసును అభినందించి, రివార్డులు అందజేశామని డీఎస్పీ తెలిపారు.

ఫ్రిక్షన్ ఆధారిత రంగంలో సవాళ్లను అధిగమించాలి

● భావితరాల పరిశోధకులకు ఇన్‌స్పైర్‌గా ఐసీఎఫ్‌పీ సదస్సు ● మిధాని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీఎస్ నారాయణమూర్తి

తిరుపతిరూరల్, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): ఫ్రిక్షన్ (ఘర్షణ) ఆధారిత ప్రాసెసింగ్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడంలో పరిశోధకులు కీలకపాత్ర పోషించాలని హైదరాబాద్‌కు చెందిన మిధాని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీఎస్ నారాయణ మూర్తి పేర్కొన్నారు. తిరుపతిలోని ఓల్డ్ తిరుచానూరు రోడ్డులో ఉన్న ఎస్‌ఆర్ కన్వెన్షన్‌లో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ ప్రాసెసింగ్ ఆఫ్ మెటీరియల్స్ అండ్ ఫ్యాబ్రికేషన్ ఆఫ్ ప్రొడక్ట్స్(ఐఏ-పీఎంఎఫ్‌పీ) ఆధ్వర్యంలో తిరుపతి ఐఐటీ, పాట్నా ఐఐటీ, ఐఐఎస్సీ (బెంగళూరు) సహకారంతో మూడ్రోజుల ఫ్రిక్షన్ బేస్డ్ ఇంటర్నేషనల్ సదస్సు(ఐసీఎఫ్‌పీ-2కె25)ను శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సదస్సుపై రూపొందించిన పుస్తకాన్ని ఐసీఎఫ్‌పీ అధ్యక్షుడు సత్యం సువాస్, బెంగళూరుకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ సతీష్ విక్రైలాష్, తిరుపతి ఐఐటీ డీన్ ప్రొఫెసర్ అరుణ్‌తంగిరాల, ఐఏ-పీఎంఎఫ్‌పీ అధ్యక్షుడు ప్రొఫెసర్ టీఎస్ శ్రీవాత్సవ్‌లతో కలసి ఆయన ఆవిష్కరించారు. నారాయణమూర్తి మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల పరిశోధకులకు ఈ సదస్సు ఇన్‌స్పైర్‌గా ఉంటుందని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న ఈ రంగంలో పరిశోధకులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కాగా ఘర్షణ ఆధారిత తయారీ, స్మార్ట్ మ్యానుఫాక్చరింగ్ తయారీ, సాంకేతికతల అభివృద్ధిపై పలువురు వక్తలు ఉపన్యసించారు. కన్వీనర్‌గా తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ అజయ్‌కుమార్ వ్యవహరించారు. 8దేశాలకు చెందిన అంతర్జాతీయ పరిశోధకులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నారాయణమూర్తి, సత్యం సువాస్ తదితరులు

శ్రీసిటీలో చెన్నై ఏంజిల్స్ ప్రతినిధుల బృందం



ప్రతినిధుల బృందంతో శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఏంజిల్స్‌కు చెందిన 19 మంది ప్రతినిధుల బృందం శనివారం శ్రీసిటీని సందర్శించింది. కె.మహాలింగం నేతృత్వంలోని బృంద సభ్యులకు శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రపంచ శ్రేణి మౌలిక వసతులు, వ్యాపార అనుకూలమైన వ్యవస్థలను వివరించారు. శ్రీసిటీ పర్యటనలో ఉన్న వీఎస్ఎన్ఎల్ మాజీ ఛైర్మన్, పద్మశ్రీ డాక్టర్ హనుమాన్ చౌదరితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టెలికం రంగంలో అపార అనుభవం ఉన్న చౌదరి, ఆయన అనుభవాలను, పలు సాంకేతిక పురోగతికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీసిటీ పారిశ్రామిక కార్యకలాపాలు, ఇక్కడ అనుసరిస్తున్న పద్ధతులు అధ్యయనం, పెట్టుబడి అవకాశాల పరిశీలన దిశగా బృందం పర్యటన సాగింది. అనంతరం శ్రీసిటీలోని డైకిన్, ఇసుజు, కోల్గేట్, ఎప్సాక్, ఎవర్ ఓల్డ్, సీఈటీసీ తదితర పరిశ్రమలను బృందం సందర్శించింది.

శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ

● నేడు పద్మావతీ అమ్మవారి ఆలయం మూసివేత

తిరుచానూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ జరిగింది. ఉదయం సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొపి సహస్రనామార్చన, నిత్యార్చన చేపట్టారు. తర్వాత అమ్మవారి మూలమూర్తికి, ఉత్సవర్లకు, ఉపాలయాలకు, పరివార దేవతలకు, విమాన ప్రాకారానికి, ధ్వజస్తంభానికి పవిత్రాలు సమర్పించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు యాగశాలలో ఆరాధన, హోమాలు, నివేదన తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కాగా, చంద్రగ్రహణంలో భాగంగా అమ్మవారి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 2.15 గంటలకు మూసివేయనున్నారు. తిరిగి సోమవారం వేకువ జామున తలుపులు తెరచి, ఆలయ శుద్ధి, సంప్రోక్షణ తర్వాత భక్తులకు అమ్మవారు దర్శన భాగ్యం ఇవ్వనున్నారు.



ఉత్సవమూర్తికి పవిత్రమాలలు సమర్పిస్తున్న అర్చకులు

కారు దగ్ధం



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంటలు చెలరేగి కారు దగ్ధమైన ఘటన తిరుపతి మంగళం రోడ్డులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. తిరుపతి అగ్నిమాపక దళాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి వివరాల మేరకు.. తిరుచానూరుకు చెందిన ఎంబీ కిరణ్ కుటుంబ సభ్యులతో కలసి తిరుపతి మంగళం రోడ్డులోని సురక్ష ఆసుపత్రికి కారులో వస్తున్నారు. ఫ్లైవోవర్ వద్ద వెళుతుండగా ఇంజిన్ వేడెక్కి మంటలు చెలరేగాయి. వెంటనే కారులో ఉన్న వారు కిందకు దిగేశారు. ఆ మార్గంలో వెళుతున్న అలిపిరి సీఐ రాంకిషోర్ తన సిబ్బంది సహాయంతో మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఎస్‌ఐ నాగార్జున రెడ్డి కేసు నమోదు చేశారు.

వెంకటగిరికి చేరిన పర్యావరణ ప్రేమికుడి యాత్ర

వెంకటగిరి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితం కోరుతూ తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ముత్తు సెల్వాన్ చేపట్టిన సైకిల్ యాత్ర శనివారం వెంకటగిరికి చేరింది. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి ఆయన పట్టణంలోని విశ్వోదయ కాలేజీ గ్రౌండ్‌లో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ముత్తు సెల్వాన్ 2021లో సైకిల్ యాత్రను ప్రారంభించి, నాలుగేళ్లుగా కొనసాగిస్తుండటం అభినందనీయమన్నారు. ముత్తు సెల్వాన్ మాట్లాడుతూ కరోనా కాలంలో ఆక్సిజన్ కొరతతో జనాలు చనిపోవడం చూసి బయోమెడ్రికల్ ఇంజనీరుగా పనిచేస్తున్న తాను విధులకు రాజీనామా చేసి సైకిల్ యాత్ర చేపట్టానన్నారు. పర్యావరణ ప్రాముఖ్యతపై ప్రజలను చైతన్యపరుస్తూ ఎనిమిది దేశాలలో సైకిల్ యాత్ర పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు నేపాల్, బంగ్లాదేశ్‌లో పర్యటన పూర్తయిందని, మన దేశంలో 23 రాష్ట్రాలు, ఏపీలో 10 జిల్లాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో యాత్ర పూర్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 1,356 రోజులు 38,600 కిలోమీటర్లు ప్రయాణించినట్లు వెల్లడించారు. 8లక్షల మొక్కలు నాటినట్లు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే ఆయన్ను సత్కరించి, ఆర్థిక సాయం అందించారు.



ఎమ్మెల్యేతో కలిసి మొక్కనాటుతున్న పర్యావరణ ప్రేమికుడు ముత్తు సెల్వాన్

ఉపాధి బకాయిలు రూ.50.20కోట్లు

● 16 వారాలుగా కూలీలకు అందని వేతనాలు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మే నుంచి ఇప్పటివరకు రూ.50.20 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. మెటీరియల్ కాంపోనెంట్(సీసీరోడ్లు, డ్రైన్లు, గోకులాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి) కింద రూ.70 కోట్లు రావాల్సి ఉంది. గడచిన నాలుగు నెలలు(16 వారాలు)గా కూలీలకు బిల్లులు సరిగా ఇవ్వడం లేదు. ఈ కారణంతో పనులకు వచ్చే కూలీల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. జిల్లాలోని 774 పంచాయతీల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 53 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. మరో 8 నెలల్లో 50 లక్షల పనిదినాలు పూర్తి కావాల్సి ఉంది. బిల్లులు రాకపోవడంతో కుటుంబం గడవటం కష్టమవుతోందని, ప్రతివారమూ ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

త్వరలోనే బకాయిలు చెల్లిస్తాం

● శ్రీనివాసప్రసాద్, డ్వామా పీడీ

ఉపాధి హామీ పథకం కూలీలకు త్వరలోనే వారి ఖాతాకు బకాయిలు జమచేస్తాం. ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉంది. జిల్లాలో 16 వారాలకు సంబంధించి 1.71లక్షల మంది కూలీలకు రూ.50కోట్లపైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం చేసిన అభివృద్ధి పనులకు మరో రూ.70కోట్లు రావాల్సి ఉంది.

అన్ని వసతులతో టిడ్కో ఇళ్లు: విజయశ్రీ



టిడ్కో ఇళ్ల వద్ద అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్ని వసతులతో కూడిన టిడ్కో ఇళ్లను త్వరలోనే లబ్ధిదారులకు అందజేయనున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. నాయుడుపేట - చెన్నై జాతీయ రహదారి సమీపంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసే విధంగా గత టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు షేర్‌వాల్ టెక్నాలజీతో టిడ్కో గృహాలకు శ్రీకారం చుట్టి 80శాతం పైగా పూర్తిచేశారని తెలిపారు. మిగిలిన పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించడంలో గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు. కూటమి ప్రభుత్వం టిడ్కో గృహాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందించేందుకు మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. నాయుడుపేట, సూళ్లూరుపేట మున్సిపాలిటీల పరిధిలో సుమారు 5వేల టిడ్కో గృహాలను నిర్మించి పేదలకు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, టీడీపీ నాయకులు షేక్ రఫీ, నానాబాల సుబ్బారావు, ముత్యాలయ్య, పొట్లపూడి రాజేష్, అశోక్‌రెడ్డి, పార్థసారధి, అవధానం సుధీర్, ఆమవరపు సత్యం, చేవూరు చెంగయ్య, నిత్యకృష్ణారెడ్డి, నారాయణ, రవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జీవన ఎరువుల వాడకంతో అధిక దిగుబడులు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీవన ఎరువుల వాడకంతో అధిక దిగుబడులను పొందవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతులు అవసరానికి మించి రసాయన ఎరువులు వాడటం వల్ల భూమి ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు తెగుళ్ల ఎక్కువగా సోకి ఖర్చులు పెరిగిపోతాయన్నారు. ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులను వాడుకోవడం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడి దిగుబడులు పొందవచ్చన్నారు. ఏడీఏ నాగార్జునసాగర్ మాట్లాడుతూ నానో యూరియా, నానో డీఏపీ పైరుపై పిచికారి చేయడం వల్ల వినియోగ సామర్థ్యం పెరిగి, నేల ఆరోగ్యం చేడిపోకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ధనంజయరెడ్డి, ఏవో గణేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు నానో ఎరువుల వినియోగంపై దృష్టి పెట్టాలి

దొరవారిసత్రం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైతులు నానో ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్ అన్నారు. శనివారం దొరవారిసత్రం మండలం నెలబల్లి రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించిన ఆయన అక్కడే రైతులతో మాట్లాడారు. నానో యూరియా, నానో డీఏపీల గురించి రైతులకు వివరించారు. నానో డీఏపీలో 8శాతం నైట్రోజన్, 16 శాతం ఫాస్పరస్ ఉంటుందని తెలిపారు. చిన్న కణాల కారణంగా నానో డీఏపీ 90 శాతం కంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన పోషకాలను మొక్కలకు అందిస్తుందన్నారు. అలాగే లీటర్ నీటికి 2-4 ఎంఎల్ నానో యూరియా పిచికారి చేసుకుంటే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో తిరుపతి ఏడీఏ ధనంజయ, సూళ్లూరుపేట ఏడీఏ కాంచన, దొరవారిసత్రం, నాయుడుపేట ఏవోలు జ్యోతిర్మయి, గణేష్, ఏఈవో గవాస్కర్, ఎంపీఈవో గ్రేస్ పాల్గొన్నారు.

బయో ఫర్టిలైజర్స్‌పై అవగాహన

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో శనివారం రైతులకు బయో ఫర్టిలైజర్స్, నానో యూరియా, నానో డీఏపీలపై ఏవో శిరీషా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరికీ నానో యూరియా, నానో డీఏపీ, బయో ఫర్టిలైజర్స్ వాడడం వల్ల భూమిలో నత్రజని శాతం పెరిగి దిగుబడి అధిక వస్తుందన్నారు. కార్యక్రమంలో బాలాయపల్లి ఏవో ప్రవీణ, ఏఈవో రామ్మోహన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు రోటరీ వెస్ట్ క్లబ్ చేయూత

గూడూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోటరీవెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు చేయూత ఇస్తున్నామని రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ రవీంద్ర అన్నారు. శనివారం స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో శ్రీకాంత్‌రెడ్డి దాతృత్వంతో మహిళలకు కుట్టుమిషన్లు అంద జేశారు. లక్ష్మి, పీఎం రావు దంపతుల సహకారంతో హాకీ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహాలను అందజేశారు. కార్యక్రమంలో రామకృష్ణ స్వరూప్, మునిగిరీష్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, శ్రీకంటి రామ మోహన్‌రావు, నాశిన నాగులు, తాళ్లూరు శ్రీనివాసులు, కోదండ రామయ్య, శ్రీలక్ష్మి, పీఎంరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

సూళ్లూరుపేట, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పొట్టి శ్రీరాముల వీధికి చెందిన కర్లపూడి నటరాజ(80) శనివారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఆయన నేత్రాలను ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సేకరించి చెన్నై శంకర నేత్రాలయకి అందజేసింది.

పోలేరమ్మ జాతరను ప్రశాంతంగా నిర్వహిస్తాం

ఎమ్మెల్యే కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణ, పక్కన ఆలయ చైర్మన్ మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ విశ్వనాథ నాయుడు

వెంకటగిరి, సెప్టెంబరు6 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర నిర్వహణపై అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ప్రశాతంగా జరిగేలా చూస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పింజల వీరయ్య కల్యాణ మండపంలో జాతర శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులందరూ అమ్మవారిని సులభంగా దర్శించుకులా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. గతంలో జరిగిన లోపాలను నివృత్తి చేసుకొంటూ పట్టణ ప్రజల సూచనలను, సలహాలను తీసుకొని జాతర వైభ వంగా జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. అమ్మవారి జాతరలో ఆచార సంప్రదాయాలకు ఎలాంటి అవాంతరాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పలువురు పట్టణవాసులు గత జాతరలో జరిగిన లోపాలను గుర్తుచేయడంతో వాటి నివారణ తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సమావేశంలో పోలేరమ్మ దేవస్థానం చైర్మన్ గొల్లగుంట మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాథ నాయుడు, తహసీల్దార్ నర్సింహరావు, సీఐ రమణ, నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, బీరం రాజేశ్వరరావు, తోట కృష్ణయ్య పాల్గొన్నారు.

ట్రంప్ సుంకాలను వ్యతిరేకించండి



టవర్‌క్లాక్‌సెంటర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

గూడూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారతీయ ఎగుమతులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న సుంకాలను ప్రజలందరూ వ్యతిరేకించాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత ఎగుమతులపై సుంకాన్ని 50శాతానికి పెంచడంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ప్రధానంగా ఆక్వా, టెక్స్‌టైల్స్ ఉత్పత్తుల ధరలు పడిపోయాయన్నారు. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులపై కూడా ఆంక్షలు విధించడంతో అమెరికాకు వెళ్లిన విద్యార్థుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు. కార్యక్రమంలో ప్రభాకర్, శశికుమార్, ప్రసాద్, చంద్రయ్య, మణి, కోటి, రమణయ్య, మధు, జిలానీ, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న సుంకాలకు వ్యతిరేకంగా సూళ్లూరుపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్షాలు నిరసన తెలిపాయి. సీపీఎం నాయకుడు రియాజ్ మాట్లాడుతూ భారతదేశం నుంచి ఎగుమతి అవుతున్న వస్తువులపై 50 శాతం సుంకాలు విధించడం వల్ల ఆక్వా రంగం, టెక్స్‌టైల్స్ రంగం పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు అక్బర్, భాస్కర్, చంద్రయ్య, మహేష్, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు మధ్యాహ్నం నుంచి చెంగాళమ్మ ఆలయం మూత

సూళ్లూరుపేట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయాన్ని చంద్రగ్రహణం కారణంగా ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుంచి మూసివేయనున్నట్లు దేవదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు ఆలయ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం అమ్మవారి పునః దర్శనం ప్రారంభమవుతుందని ఆమె పేర్కొన్నారు.

ప్రజాసేవకు యువత ముందుకు రావాలి



నెలవల రాజేష్‌తో వేలూరు కల్యాణ్‌రెడ్డి తదితరులు

పెళ్లకూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాసేవ చేసేందుకు యువత ముందుకు రావాలని టీడీపీ యువ నాయకుడు నెలవల రాజేష్ అన్నారు. శనివారం కేఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, టీడీపీ నాయకుడు వేలూరు కల్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో నెలవల రాజేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. రాజేష్‌ను పూలమాలలు, శాలువాలతో సత్కరించి భారీ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేలూరు సాయి గిరిధర్‌రెడ్డి సునీల్, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్‌అదాలత్

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి కోర్టులో ఈ నెల 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తామని సివిల్ జడ్జి విష్ణువర్మ తెలిపారు. శనివారం కోర్టులో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల సంబంధించిన కేసులన్నీ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకర్లు, న్యాయవాదులు రొంటాల చిన్నా, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

పెళ్లకూరు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీజన్‌కు ముందుగానే జిల్లాల వారీగా రైతుల అవసరాలకు తగ్గటుగా ప్రభుత్వం ఎరువులను సరఫరా చేస్తున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య తెలిపారు. శనివారం ఆయన పార్టీ నాయకులతో కలసి మీడియాతో మాట్లాడారు. వైసీపీ నాయకులు యూరియా కొరతంటూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తగినంత యూరియా అందుబాటులోకి ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్ నాయుడు, నాయకులు మదన్‌మోహన్ నాయుడు, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, తాళ్ల యుగంధర్ గౌడ్, సన్నాడి వేణురెడ్డి, సుమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌ను వినియోగించుకోండి

వాకాడు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్‌ను వినియోగించుకోవాలని ఎంపీడీవో శ్రీనివా సులు అన్నారు. వాకాడు మండల కార్యాలయం నుంచి అశోక్ పిల్లర్ వరకు వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అల్లంపాడులో గ్రామసభ

కోట, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అల్లంపాడులో శనివారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. ఇటీవల అల్లంపాడు పంచాయతీలో రీసర్వే జరిగింది. రీసర్వే వల్ల ఉపయోగాలను తహసీల్దారు జయజయరావు రైతులకు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జునరావు, వీఆర్వో కృష్ణయ్య పాల్గొన్నారు.

మన్నెగుంటలో...

చిల్లకూరు: మండలంలోని మన్నెగుంటలో తహసీల్దారు శ్రీనివాసులు గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తులు మాట్లాడుతూ తమ భూములను 18 ఏళ్ల క్రితం కినెటా పరిశ్రమకు కేటాయించారని, అప్పట్లో కొంతమంది రైతులకు అరకొర నష్టపరిహారం చెల్లించగా, కొంతమంది రైతులకు నష్టపరిహారం అందించలేదన్నారు. ప్రస్తుత ధరలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని కోరారు. సర్పంచు ఏడుకొండలు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.